


రిలే నిరాహార దీక్షల శిబిరం వద్ద కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్‌గా విశాఖ



- దేశవ్యాప్తంగా 30 నగరాలను గుర్తించిన రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ
- ఆ జాబితాలో 17వ స్థానంలో నగరం
- రాష్ట్రం నుంచి తిరుపతికి కూడా చోటు

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి హాట్ స్పాట్‌గా ఉన్న 17 నగరాల్లో విశాఖపట్నం స్థానం సంపాదించుకుంది. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కాలరీస్ ఇండియా దేశంలోని 100కు పైగా నగరాలను సర్వే చేసి అందులో ఎక్కువగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉన్న 30 నగరాలను గుర్తించింది. అందులో 17 నగరాలైతే మరింత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ పదిహేడు నగరాల్లో రెండు ఆంధ్రప్రదేశ్ నుంచే ఉండడం విశేషం. అందులో ఒకటి తిరుపతి కాగా మరొకటి విశాఖపట్నం. ఆయా నగరాల్లో మౌలిక వసతులు మెరుగు పరచడానికి, అభివృద్ధికి అనుగుణంగా కొత్త ప్రాజెక్టులను అక్కడి ప్రభుత్వాలు చేపట్టడం వల్ల రియల్ ఎస్టేట్ రంగం విస్తరించనుందని సంస్థ విశ్లేషించింది. చక్కటి హోటళ్లు, రిటైల్ మార్కెట్లు కూడా దీనికి దోహదపడతాయని వెల్లడించింది.

పెరుగుతున్న ఎంక్వయిరీలు

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత నగరంలో రియల్ ఎస్టేట్ రంగం కూడా ఊపిరి పీల్చుకుంది. అంతకు ముందు ప్రభుత్వం మూడు రాజధానులు అంటూ ప్రకటనలు గుప్పించి విశాఖపట్నంలో లేని బూమ్ క్రియేట్ చేయడానికి యత్నించింది. అమరావతిలో రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలేలా చేసింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ... మిగతా 6వ పేజీలో

స్టీల్‌ప్లాంటు పరిరక్షణ నా బాధ్యత

తొలి, తుది లక్ష్యం అదే...

- యాజమాన్యంతో చర్చించిన అనంతరం కేంద్రం ముందు మా ప్రతిపాదనలు ఉంచుతాం
- ఎంపీ శ్రీభరత్ సహకారంతో కర్మాగారానికి సొంత గనులు కేటాయింపునకు కృషి చేస్తాం
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, జూన్ 18: స్టీల్‌ప్లాంటు పరిరక్షణ తన ప్రధాన బాధ్యత అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆయన బుధవారం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరానికి విచ్చేసి, సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉక్కు కార్మికులకు అన్నివిధాలా సహాయ సహకారాలను అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గర్భాం మాంగనీస్ గనులు, కింతాడ క్వార్ట్ జ్ మైన్స్, సారిపల్లి ఇసుక రీచ్‌లు నెలలోగా స్టీల్‌ప్లాంటుకు రెన్యువల్ చేస్తామని హామీ ఇచ్చారు. విశాఖ స్టీలుప్లాంటును భావి తరాల వారికి అందించడమే తన తొలి, తుది లక్ష్యమన్నారు. ఈ నెల 24వ తేదీలోపు విశాఖ ఎంపీ ఎం.శ్రీ భరత్‌తో కలిసి స్టీలుప్లాంటు యాజమాన్యంతో చర్చించి ఓ ప్రణాళికను తయారుచేసుకొని, కేంద్ర ప్రభుత్వం ముందు తమ ప్రతిపాదనలు ఉంచుతామన్నారు. ఎంపీ శ్రీభరత్ సహకారంతో విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయింపునకు కృషి చేస్తామన్నారు. స్టీలుప్లాంటు ప్రైవేటీకరణ సమస్యను పరిష్కరించేంత వరకూ అవిశ్రాంత పోరాటాలకు ఉక్కు కార్మికులతో కలసి ఉంటానని హామీ ఇచ్చారు. ఉక్కు కర్మాగారం కోసం భూములిచ్చిన నిర్వాశితులకు అన్యాయం జరగనివ్వబోమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, కార్పొరేటర్లు బొండా జగన్, మొల్లి ముత్యాలునాయుడు, పల్లా శ్రీనువాస్, నిర్వాసిత నాయకులు పులి వెంకటరమణారెడ్డి, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, కేఎస్ఎన్ రావు, విల్లా రామ్మోహన్‌కుమార్, జెర్రిపోతుల ముత్యాలు, గంధం వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని పార్టీ కార్యాలయంలో పల్లాకు సన్మానం

పల్లాకు సత్కారం - వార్త I పేజీలో

పీజీ సెట్‌లో ర్యాంకుల పంట

- జియో ఇంజనీరింగ్, మెకానికల్, మెటలర్జీ విభాగాల్లో ప్రథమ ర్యాంకులు సాధించిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు
- పది లోపు ర్యాంకులు అనేక మందికి రాక...

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్/ఫార్మసీ కళాశాలల్లో ఎంటెక్/ఎం.ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఏపీ పీజీ సెట్‌లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా విద్యార్థులు మూడు కేటగిరీలలో ప్రథమ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. జియో ఇంజనీరింగ్‌లో నగరంలోని రామ్‌నగర్‌కు చెందిన సింగంశెట్టి రమ 78 మార్కులతో, మెకానికల్ ఇంజనీరింగ్‌లో పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామానికి చెందిన పైలా హేమంత్ 80 మార్కులతో, మెటలర్జీలో అనకాపల్లి మండలం వీజే పాలెం గ్రామం క్వారీ కాలనీ విద్యార్థి నందికొల్లు అనిల్‌కుమార్ 86 మార్కులతో ప్రథమ ర్యాంకులు సాధించారు. అలాగే జియో ఇంజనీరింగ్‌లో మర్రిపాలెం వుడా కాలనీ విద్యార్థిని తురుపల్లి కీర్తి రెండో ర్యాంకు, టీఎస్ఎన్ కాలనీలో ఉంటున్న మహ్మద్ అసిత్ సింకా మూడో ర్యాంకు, రేలుగుంట విద్యార్థి రుత్తల వెంకటకృష్ణ ఎనిమిదో ర్యాంకు, దేవరాపల్లి మండలం మారేపల్లికి చెందిన గేదెల నవ్య తొమ్మిదో ర్యాంకు సాధించారు. బయో టెక్నాలజీలో నగరానికి చెందిన దాసరి దేదీప్య 10వ ర్యాంకు, సివిల్ ఇంజనీరింగ్‌లో కె.కోటపాడు మండలం వారాడ విద్యార్థి రాచపల్లి హేమంత్ రెండో ర్యాంకు, అనకాపల్లి దరి అడ్డాసరం విద్యార్థి పి.మహేష్ ఐదో ర్యాంకు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో రాంబిల్లి మండలం కొప్పగుంటపాలెం గ్రామానికి చెందిన గొన్నబత్తుల సాయికుమారి ఏడో ర్యాంకు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో నగరంలోని శాంతిపురానికి చెందిన గనగళ్ల హాయిశ్రీ 11వ ర్యాంకు, ఫుడ్ టెక్నాలజీ కోర్సులో చైతన్యనగర్‌కు చెందిన హనుమంతు ధారణి నాలుగో ర్యాంకు, మెటలర్జీలో కంచరపాలేనికి చెందిన గుడ్ల జయంత్ మూడో ర్యాంకు, శ్రీనగర్ కాలనీకి చెందిన రాయవరపుముత్యాలనాయుడు నాలుగో ర్యాంకు సాధించారు.

గ్రేటర్‌లో గడగడ

గత మూడేళ్లలో కౌన్సిల్ తీసుకున్న పలు నిర్ణయాలపై విచారణ?



- జీవీఎంసీ పాలకవర్గంలోని వైసీపీ పెద్దల్లో గుబులు
- సంఖ్యా బలం ఉందని అడ్డగోలు నిర్ణయాలు
- టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యంతరాలు బేఖాతరు
- వాటన్నింటినీ ఇప్పుడు పునఃపరిశీలించేందుకు కూటమి పెద్దల కసరత్తు
- ఇప్పటికే అనేక అంశాలపై అధికారుల నుంచి సమాచార సేకరణ
- ప్రాథమిక ఆధారాలు దొరికితే విజిలెన్స్, ఏసీబీ విచారణ కోరాలని యోచన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ పాలకవర్గంలోని వైసీపీ పెద్దల్లో టెన్షన్ మొదలైంది. కూటమి అధికారంలోకి రావడంతో సమీకరణాలు మారిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. కౌన్సిల్‌లో సంఖ్యా బలం ఉంది కదా అని ఇప్పటివరకూ వైసీపీ నేతలు తాము చేయాలనుకున్న పనులు అడ్డగోలుగా చేసుకుంటూ పోయారు. టీడీపీ, జనసేన, బీజేపీ, వామపక్షాల కార్పొరేటర్లు అభ్యంతరం చెప్పినా పట్టించుకోకుండా మేయర్ ఆమోదముద్ర వేసేస్తుండేవారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో జీవీఎంసీలో గత మూడేళ్లలో చేపట్టిన ప్రాజెక్టులు, కౌన్సిల్‌లో అడ్డగోలుగా ఆమోదించిన అంశాలను తిరగదోడాలని కూటమి పెద్దలు భావిస్తున్నారు. అదే జరిగితే తాము ఇబ్బందులకు గురవడం ఖాయమనే ఆందోళన పాలకవర్గంలోని వైసీపీ పెద్దల్లో వ్యక్తమవుతోంది.

కూటమి అధికారంలోకి రావడంతో జీవీఎంసీ పాలకవర్గంలో కూడా పెనుమార్పులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జీవీఎంసీకి 2021లో జరిగిన ఎన్నికల్లో వైసీపీకి మెజారిటీ వార్డులు దక్కడంతో మేయర్ పీఠం కైవసం చేసుకుంది. కౌన్సిల్‌లో సంఖ్యాబలం ఎక్కువగా ఉండడంతో ఎలాంటి అంశమైన అజెండాలో చేరిస్తే ఆమోదం పొందడం నామమాత్రమే అన్నట్టు ఉండేది. ప్రజలకు ఇబ్బంది కలిగించే, ప్రజాధనం వృథా అవుతుందనుకున్న అంశాలపై విపక్షాలు అభ్యంతరం చెప్పినా సరే ఓటింగ్ పేరుతో వైసీపీ పాలకవర్గం పెద్దలు ఆమోదం పొందేలా వ్యవహరించేవారు. గెడ్డల్లో పూడికతీత పనులు, పార్కుల నిర్మాణం, తారురోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాళ్లు, యూపీహెచ్‌సీ భవనాల నిర్మాణాలు, చెత్త తరలింపు, వాహనాల మరమ్మతు వంటి విషయంలో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తినా వాటిపై కౌన్సిల్‌లో కనీసం చర్చించేందుకు కూడా అవకాశం ఇచ్చేవారు కాదు. మూడేళ్లపాటు అప్రతిహతంగా కొనసాగిన వైసీపీ పెద్దల హవాకు ఇటీవల ఎన్నికల ఫలితాలతో బ్రేక్ పడింది. వైసీపీ ఓటమి పాలుకావడం, కూటమి ... మిగతా 6వ పేజీలో

స్టాంపు పేపర్ల కొరత

- సంస్కరణల పేరుతో నిలిపివేసిన రిజిస్ట్రేషన్ల శాఖ
- ప్రత్యామ్నాయంగా ఈ-స్టాంపు పేపర్లు
- వాటితో బోలెడు సమస్యలు



పాత కాలం నాటి స్టాంపు పేపరు, ఏడాది నుంచి ఇస్తున్న ఈ-స్టాంపు పేపరు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో స్టాంపు పేపర్ల కొరత అధికంగా ఉంది. ఎక్కువ రేటు పెట్టి కొందామన్నా దొరకడం లేదు. సంప్రదాయ పద్ధతిలో రిజిస్ట్రేషన్లకు ఎరుపు, ఆకుపచ్చ, నీలం రంగులతో కూడిన స్టాంపు పేపర్లు ఏడాది క్రితం వరకూ అందుబాటులో ఉండేవి. వీటిని నాసిక్‌లో ముద్రిస్తే...అన్ని రాష్ట్రాలు కొని తెచ్చుకునేవి. ఒకసారి ఈ స్టాంపు పేపరు కొనుక్కుంటే వీలున్నప్పుడు దానిని వినియోగించుకునే అవకాశం ఉండేది. దీనివల్ల అక్రమాలు జరుగుతున్నాయని, అవసరమైనన్ని స్టాంపు పేపర్లు అందుబాటులో లేవని, రవాణా వ్యయం ఎక్కువ అవుతోందని...ఇలా పలు కారణాలు చూపి రిజిస్ట్రేషన్ల శాఖ సంస్కరణల పేరుతో వీటిని నిలిపివేసింది. ఆ స్థానంలో ఈ-స్టాంపింగ్ విధానం అమలులోకి తీసుకువచ్చింది. స్టాంపు వెండర్లకే ఫ్రాంకింగ్ మెషిన్లు ఇచ్చి, వాటి ద్వారా ప్రింటింగ్ తీసుకునే వెసులుబాటు కల్పించింది. అయితే దీనికి సుమారుగా రూ.40 వేల నుంచి రూ.50 వేలు పెట్టుబడి పెట్టాల్సి రావడంతో కొందరు వెండర్లు ఈ వ్యాపారం నిలిపివేశారు. దాంతో ప్రభుత్వం నుంచి కాంట్రాక్టు తీసుకున్న సంస్థే పలు కేంద్రాలను నెలకొల్పి వీటిని విక్రయిస్తోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా వీటిని అందుబాటులో ఉంచారు. అయితే పాత స్టాంపు పేపర్లు ఎవరి దగ్గరైనా ఉంటే వాటిపై రిజిస్ట్రేషన్లను ఎప్పటిలాగే అనుమతిస్తున్నారు. దాంతో చాలామంది గతంలో కొనుగోలు చేసినవి, పక్క రాష్ట్రాల నుంచి తెచ్చుకున్నవి ఉపయోగించుకుంటున్నారు. వాటిపైనే లావాదేవీలు రాసుకుంటున్నారు. పదికాలాలు దాచుకునే పత్రం కావడంతో ఎక్కువ మంది పాత స్టాంపు పేపర్లకే మొగ్గు చూపుతున్నారు.

ఈ-స్టాంపులతో సమస్య

ఈ-స్టాంపు పత్రాలతో సమస్యలు ఉన్నాయి. పాత స్టాంపు పేపరు కొనుక్కుంటే దానితో ఏ రకమైన లావాదేవీ అయినా చేసుకోచ్చు. సేల్ డీడ్ రాసుకోవచ్చు. ఒప్పందం చేసుకోవచ్చు. డెవలప్‌మెంట్ అగ్రిమెంట్, గిఫ్ట్ డీడ్...ఇలా ఏదైనా రాసుకునే వెసులుబాటు ఉంది. కానీ ఈ-స్టాంపులో అది లేదు. దానిని కొనేటపుడు 'దేని కోసం?' అని ప్రశ్నిస్తారు. సేల్ డీడ్/అగ్రిమెంట్/గిఫ్ట్ డీడ్...ఇలా దేనికైతే అదే చెప్పాలి. ఆ ప్రయోజనానికే దానిని వాడాలి. సేల్ డీడ్‌కు స్టాంపు తీసుకొని, దానిపై గిఫ్ట్ డీడ్ రాస్తే సబ్ రిజిస్ట్రార్ అంగీకరించరు. మరో స్టాంపు పేపరు అదే ప్రయోజనం కోసం కొని రాయించుకొని రావాలని తిరస్కరిస్తున్నారు. దీనివల్ల తెలియని వారు ఇబ్బంది పడుతున్నారు.

అదనపు మొత్తాల వసూళ్లు

స్టాంపు వెండర్లకు ప్రభుత్వం గతంలో కమీషన్లు ఇచ్చేది. ఇప్పుడు ఆ విధానం ... మిగతా 6వ పేజీలో

గంజాయిపై ఉక్కుపాదం

నియంత్రణకు 100 రోజుల యాక్షన్‌ప్లాన్

- సరిపల్లి వద్ద చెక్‌పోస్ట్, సీసీ కెమెరాలు ఏర్పాటు
- రవాణా, విక్రయం, వినియోగం అడ్డుకట్టకు యాక్షన్ టీమ్‌లు
- ఉపాధ్యాయులను భాగస్వామ్యులను చేస్తూ యాంటీ డ్రగ్స్ కమిటీలు
- కళాశాలల్లో అవగాహన సదస్సులు
- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ నిర్ణయం



సీపీ రవిశంకర్ అయ్యన్నార్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో గంజాయికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు వంద రోజులు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. గంజాయి రవాణా, విక్రయం, వినియోగంపై ఉక్కుపాదం మోపేందుకు యాక్షన్ టీమ్‌లను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. యువత, విద్యార్థులు గంజాయి వినియోగానికి అలవాటుపడకుండా ఉండేందుకు ఉపాధ్యాయులను భాగస్వామ్యులను చేస్తూ యాంటీ డ్రగ్స్ కమిటీలను నియమించాలని కిందిస్థాయి అధికారులను నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశించారు.

గంజాయి రవాణా, విక్రయం, వినియోగానికి నగరం అడ్డాగా మారిందని, మూడు నెలల్లో దీనిని సమూలంగా కూకటివేళ్లతో పెకిలివేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత పోలీసులను ఆదేశించిన విషయం తెలిసిందే. హోం మంత్రి ఆదేశాలతో ఒక్కరోజు వ్యవధిలోనే గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. ముందు గంజాయి రవాణాను నియంత్రించాల్సి ఉందని గుర్తించిన సీపీ రవిశంకర్ అయ్యన్నార్ నగరంలోని ప్రవేశించేందుకు అవకాశం ఉన్న మార్గాల్లో పటిష్టమైన నిఘా ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఏజెన్సీ నుంచి నగరానికి వచ్చే మార్గంలో సరిపల్లి వద్ద చెక్‌పోస్టుతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతరం వాహనాల తనిఖీలు నిర్వహించాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు.

అలాగే విద్యార్థులు, యువత గంజాయి, మత్తు పదార్థాల వినియోగానికి బానిసలుగా మారుతుండడంతో వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఉపాధ్యాయులను భాగస్వామ్యులను చేస్తూ పోలీసులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో కలిపి యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటుచేయాలని సీపీ ఆదేశించారు. ఆయా కమిటీలు గంజాయి వినియోగిస్తున్న యువత, విద్యార్థులను గుర్తించి పోలీసులకు సమాచారం ఇస్తే వారిని డీఅడిక్షన్ సెంటర్లకు తరలించి మామూలు మనుషులుగా మార్చడంతోపాటు వారికి గంజాయి ఎక్కడి నుంచి ... మిగతా 6వ పేజీలో

కారుపై ఎమ్మెల్యే స్టిక్కర్‌తో

వైసీపీ జిల్లా అధ్యక్షుడి హల్‌చల్

- కొంతకాలంగా ఇలానే తిరుగుతున్నా పట్టించుకోని అధికారులు



ఎమ్మెల్యే స్టిక్కర్‌తో ఉన్న వైసీపీ జిల్లా అధ్యక్షుడి కారు

ఎండాడ, జూన్ 18: జిల్లా వైసీపీ అధ్యక్షుడు కోలా గురువులు తన కారుపై ఎమ్మెల్యే స్టిక్కర్ అతికించుకుని దర్జాగా తిరుగుతున్నారు. ఆయన పార్టీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇలా కారుపై ఎమ్మెల్యే స్టిక్కర్ అతికించుకున్నట్టు సమాచారం. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయినా ఆయన స్టిక్కర్ తీయలేదు. పోలీసులు, ఇతర యంత్రాంగం కూడా పట్టించుకోలేదు.

కోలా గురువులుకు ఎమ్మెల్యే కావాలన్నది బలమైన కోరిక. ఆయన 2009లో విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. మళ్లీ 2014లో వైసీపీ అభ్యర్థిగా రంగంలోకి దిగి ఓటమి చవిచూశారు. 2019లో ఆయనకు టికెట్ దక్కలేదు. కాగా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఆయన్ను దురదృష్టం వెన్నాడింది. దీంతో చట్టసభల్లో అడుగుపెట్టాలనే కోర్కె కోలా గురువులుకు తీరలేదు. కాగా వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న పంచకర్ల రమేశ్‌బాబు పార్టీకి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో గురువులకు అవకాశం లభించింది. ఇక అక్కడినుంచి తన కారుపై ఇదిగో ఇలా ఎమ్మెల్యే స్టిక్కర్ అతికించుకుని తిరిగేస్తున్నారు.

చంద్రబాబునాయుడు ఫ్లెక్సీకి న్యాయవాదుల క్షీరాభిషేకం

- ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై హర్షం



కేక్ కట్ చేస్తున్న ఎంపీ శ్రీభరత్, న్యాయవాదులు

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దును హర్షిస్తూ విశాఖపట్నం బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫొటోకు క్షీరాభిషేకం చేశారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు నెలల తరబడి దీక్షలు చేశారు. జిల్లా జడ్జి కోర్టు ముందు శిబిరం ఏర్పాటుచేసి ఎన్నికల సమయం వరకు ఆందోళన నిర్వహించారు. కూటమి (తెలుగుదేశం, జనసేన, బీజేపీ) ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని రద్దు చేయడంతో వారంతా అదే శిబిరం వద్ద మంగళవారం చంద్రబాబునాయుడు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అంతకుమందు కేక్ కట్ చేశారు. టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షులు బత్తి రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీభరత్, విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ, న్యాయవాద సంఘ నాయకులు పృథ్వీరాజ్, గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడు ఫొటోకు క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు



అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ


ఆలయ సన్నిధిలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అక్కయ్యపాలెం, జూన్ 18: గ్రేటర్ 27వ వార్డు దొండపర్తిలోని దుర్గమ్మ జాతర మహోత్సవంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో అంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే అక్కయ్యపాలెంలో కుంచుమాంబ పండగ సందర్భంగా అమ్మవారిని స్థానిక నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, టీడీపీ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'మాజీ మంత్రి అమర్ ఓ అజ్ఞాని'

మహారాణిపేట, జూన్ 18: మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఓ అజ్ఞాని అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ విమర్శించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మిడిసిపడిన నేతలకు ఇటీవల జరిగిన ఎన్నికలలో ప్రజలు గుణపాఠం ఇచ్చేలా తీర్పుఇచ్చారన్నారు. మంత్రిగా అమర్‌నాథ్ ఎంత అవగాహనా రాహిత్యంతో మాట్లాడారో ప్రజలు గ మ నించారన్నారు. అనకాపల్లిలో మైనింగ్ మాఫియాకు ఆయన అధ్యక్షుడిగా వ్యవహరించారని విమర్శించారు. బడుగు వర్గాలకు చెందిన విస్సన్నపేట భూములను దోచుకు న్నారని ఆరోపించారు. రాష్ట్రానికి రూ. 13 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయని అబద్ధాలు చెప్పి మోసం చేశారని అన్నారు. ఇప్పుడు రుషికొండపై నిర్మిం చిన భవనాలు ఏ విధంగా ఉపయోగించుకోవాలో ఉచి త సలహాలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. అమర్ అక్ర మంగా చేసిన అమ్మోనియం నైట్రేట్ సరఫరాపై సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

పల్లా శ్రీనివాస్‌కు అభినందనలు


పల్లాకు పుష్పగుచ్ఛమిస్తున్న చక్రవర్తి దంపతులు, అభిమానులు

జ్ఞానాపురం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు టీడీపీ విశాఖ పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, జీవీఎంసీ 33వ వార్డ క్లస్టర్ ఇన్ చార్జ్, టీడీపీ రాష్ట్ర బీసీ గవర సామాజిక వర్గం సాధికారక సమితి సభ్యురాలు తిరుమల దేవి చక్రవర్తి దంపతులు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు నుంచి గాజువాక పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లి పాల్గొన్నారు. అనంతరం గాజువాకలో పల్లా శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు. 33వ వార్డు నాయకులు సింగంపల్లి మాధవి, ఎల్. కనకదుర్గ, సీహెచ్ వెన్నెల, జి. భరత్‌కుమార్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్: పల్లా శ్రీనివాస్‌ను 35 వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుతో పాటు బీసీ నాయకులు పార్టీ కార్యాలయంలో కలసి అభినందనలు తెలిపారు.


కేజీహెచ్ వద్ద గతంలో నిర్వహించిన అన్న క్యాంటీన్


లోపల భోజనాలకు వీలుగా ఉన్న ఫర్నిచర్

మళ్లీ పేదల ఆకలి తీర్చే దిశగా..

- సౌత్‌లో మూడు చోట్ల అన్నక్యాంటీన్ల పునః ప్రారంభానికి చర్యలు
- ఇప్పటికే భవనాలు శుభ్రం చేసే పనిలో జీవీఎంసీ యంత్రాంగం
- రోజువారి కూలీలు, ఇతర ప్రాంతాలనుంచి వచ్చే వారికి మేలు

డాబాగార్డెన్స్, జూన్ 18: పేదల ఆకలి తీర్చేందుకు మళ్లీ అన్న క్యాంటీన్లు సిద్ధమవుతున్నాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటిని పునఃప్రారంభించనున్నారు. దక్షిణ నియోజకవర్గంలో టర్నర్‌చౌల్ట్రీ, కేజీహెచ్, వన్‌టౌన్ పరిసర ప్రాంతాల్లో గతంలో వీటిని ఏర్పాటు చేశారు. అల్పాహారం 400 మందికి, మధ్యాహ్న భోజనం 500 మందికి, రాత్రి భోజనం 500 మందికి చొప్పున రోజూ మూడు పుటలా 1500 మందికి అతి తక్కువ ధరకు ఆహారం లభించేది. కార్మికులు, దినసరి కూలీలు, నిరుపేదలు లబ్ధిపొందారు. రూ.15తోనే రోజుగడవడానికి వీలయ్యేది. నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందడంతో అప్పట్లో ఈ అన్న క్యాంటీన్లకు మంచి ఆదరణ లభించింది.

వైసీపీ పాలనలో తొలగింపు..

ఐదేళ్ల కిందట వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ అన్న క్యాంటీన్లను తొలగించారు. ప్రస్తుతం ఈ భవనాల్లోని టేబుల్స్, కుర్చీలు పూర్తిగా పాడై మూలకు చేరాయి. రంగులు వెలసిపోయాయి. పిచ్చి మొక్కలు పెరిగిపోయి పరిసరాలు అధ్వానంగా మారాయి. ఈ భవనాలను కొంత మంది ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలకు వేదికలుగా మారాయి. అయితే, వీటిలో కొన్నింటిని సచివాలయాలుగా వినియోగిస్తున్నారు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో అధ్వాన స్థితిలో ఖాళీగా వదిలేసిన ఈ భవనాలను మరమ్మతులు చేపట్టి రంగులు వేసి గతంలో మాదిరిగానే అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకుంటున్నారు.


టర్నర్‌చౌల్ట్రీ వద్ద అన్న క్యాంటీన్ భవనం

సూర్యాబాగ్..కేజీహెచ్..కురుపాం మార్కెట్‌లలో అన్న క్యాంటీన్లు గతంలో నిర్వహించారు. అలాగే, సూర్యాబాగ్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్మించిన అన్న క్యాంటీన్ త్వరలోనే ప్రారంభానికి సిద్ధం కానుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. పేదలకు రూ.5కే ఆహారం అందించాలనే ఉద్దేశంతో గతంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నగరంలో 25 అన్నక్యాంటీన్లు ప్రారంభించగా, దక్షిణ నియోజకవర్గంలో తొలుతగా ప్రారంభించిన వాటిలో సూర్యాబాగ్‌లో అన్నక్యాంటీన్ ఒకటి. నగరం మధ్యలో ఉన్న ఈ క్యాంటీన్ జగదాంబ, డాబాగార్డెన్స్, పూర్ణామార్కెట్ ప్రాంతాలకు వెళ్లేవారికి సౌలభ్యంగా ఉండేది. రోడ్డుపైనే అందుబాటులో ఉండటంతో నిరుపేదలు ఎంతో మందికి ఆకలి తీర్చేది. ఇప్పుడు మళ్లీ అందుబాటులోకి వస్తుండడంతో పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

బృహత్తర కార్యక్రమం..



దక్షిణ నియోజకవర్గంలోని 100 రోజుల ప్రణాళికలో భాగంగా అన్న క్యాంటీన్లన్ల ఏర్పాటుకుసన్నద్ధమవుతున్నాం. ఇక్కడ ఎక్కువ మంది రోజువారీ కూలీలతోపాటు కేజీహెచ్, ఇతరత్రా ఆస్పత్రులకు వచ్చేవారు, అనేక పనులపై టౌన్‌కు వచ్చేవారికి భోజనం చేసే అవకాశం కలుగుతుంది. అన్నక్యాంటీన్ల ఏర్పాటు ద్వారా పేదల ఆకలితీర్చేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయం.

- వంశీకృష్ణ, ఎమ్మెల్యే

పేదల ఆకలి తీరుతుంది



అన్నక్యాంటీన్‌ల ద్వారా పేద, మధ్య తరగతి వారికి ఉపయోగకరం. కేవలం రూ.5 భోజనంతో దూర భారం నుంచి వస్తున్న వారికి ఎంతో మేలు. అనేక పనులపై ఇతర ప్రాంతాల నుంచి వస్తుంటారు. హోటళ్లలో భోజనం చేయాలంటే ఖరీదైన వ్యవహారం. పేదలకు అందుబాటు ధరలో అన్న క్యాంటీన్లతో ఆకలి తీరుతుంది.

- సింహాచలం, పాదచారుడు

100 రోజుల ప్రణాళిక



100 రోజుల ప్రణాళికాలో భాగంగా దక్షిణ నియోజకవర్గంలో అన్న క్యాంటీన్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. ఆయా క్యాంటీన్ల మరమ్మతు, ఇతరత్రా మౌలిక సదుపాయాలపై పూర్తిస్థాయి ఆదేశాలు రావాలి. నిధులు కేటాయించాల్సి ఉంది. టర్నర్‌చౌల్ట్రీ వద్ద అన్నక్యాంటీన్, కేజీహెచ్, కురుపాం మార్కెట్ వద్ద అన్నక్యాంటీన్లను ఇప్పటికే శుభ్రపరిచే పనులను సైతం ప్రారంభించాం.

- జోన్ 4 జోనల్ కమిషనర్, పీవీవీడీ ప్రసాద్

ఇంటర్నేషనల్ రిఫరీ సూర్యనారాయణకు సన్మానం

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 17: ఇంట ర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ రిఫరీ నగరానికి చెందిన కంచరాన సూర్యనారాయణకు అరుదైన గౌరవం దక్కిం ది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ప్రారంభమైన ఖేలో ఇండియా జోన్-సీ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో రి ఫరీగా వ్యవహరించేందుకు వెళ్లిన ఆ యనను, భారత వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య, టోర్నీ నిర్వాహక ప్రతినిధు లు ఘనంగా సత్కరించారు. దాదాపు మూ డు దశాబ్దాలకు పైగా వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య సీనియర్ ఉపాధ్యక్షుడిగా రాష్ట్ర, జిల్లా సంఘాల అధ్యక్ష కార్యదర్శునిగానే కాకుండా అంతర్జాతీయ రిఫరీగా క్రీడారంగానికి సూర్యనారాయణ చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు.


సత్కరిస్తున్న వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య ప్రతినిధులు

విశ్వ విద్యాలయాలను ప్రక్షాళన చేయాలి

సీతంపేట, జూన్ 18: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావును ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విశ్వ విద్యాలయాలు ప్రక్షాళన చేయాలని కోరారు. అధికారిక ఓఎస్డీలను నియమించాలని, విశ్వ విద్యాలయాలలో బోధన, బోధనేతర సిబ్బందిని, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను తక్షణమే భర్తీకి నోటిఫికేషన్ విడుదలకు చొరవ తీసుకోవాలని కోరారు. త్వరలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించాలని, పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఐక్య విద్యార్థి ఫ్రంట్ అధ్యక్షుడు ఎం. శాంతిభూషణ్, కిసాన్ మోర్చా జిల్లా సెక్రటరి పొట్నూరి వెంకట కృష్ణారావు, జింజలూ రి గోవిందు, వాసుపల్లి రాంబాబు, సనపల తిరుపతిరావు, రూప, రజిని తదితరులు పల్లా శ్రీనివాసరావు దృష్టికి పలు సమస్యలు తీసుకువెళ్లారు. ఈవిషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని పల్లా హామీ ఇచ్చారు.


టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుని సత్కరిస్తున్న హేమంత్‌కుమార్

జాతి ఐక్యతకు భంగం కలిగే ప్రసంగాలు సరికావు

- నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉప కులపతి ఆచార్య బాలమోహన్‌దాస్

సీతమ్మధార, జూన్ 18: జాతి ఐక్యతకు భంగం కలిగేలా, విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేయడం ఏ మాత్రం స రి కాదని నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి, గాంధీ సెంటర్ అధ్యక్షులు ఆచార్య బాలమోహన్‌దాస్ పేర్కొన్నారు. ఐక్య రాజ్య సమితి ఏటా జూన్ 18న అంతర్జాతీయ అసందర్భ ప్రసంగాల ప్రతిఘటన దినంగా ప్రకటించిన నేపథ్యంలో బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్ నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థలు అనుచితరీతి ప్రసంగాలను ప్రతిఘటించండి అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను ముఖ్య అతిథిగా బాలమోహన్‌దాస్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఫౌండేషన్ సంస్థ ఛైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూప్రజలను జాగృతం చేయాలని సంకల్పంతో ఈ నెల ఆదివారం 23న బుల్లయ్య కళాశాలలో ఈఅంశంపై సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో విద్యావేత్తలు, మతపెద్దలు పాల్గొని అభిప్రాయాలు తెలుపనున్న ట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజ్ఞాన్‌కుమార్, అబ్దుల్ మునిర్ బాషా, డాక్టర్ సత్యమూర్తి పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాలమోహన్‌దాస్, తదితరులు

ఘనంగా కుంచుమాంబ అమ్మవారి పండుగ

మురళీనగర్, జూన్ 18 ; మాధవధారలో మంగళవారం గ్రామ దేవత శ్రీ కుంచుమాంబ అమ్మవారి వార్షిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి పాత రామాలయం వద్ద అమ్మవారి శతకం పట్టు వద్ద భక్తులు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ మాధవ యువజన సమాజం ఆధ్వర్యంలో ఈ మహోత్సవాలు నిర్వహించారు. వేడుకల్లో మాధవధార మానవసేవే మాధవసేవ అసోసియేషన్ సభ్యులు హాజరైన భక్తులకు ప్రసాదాలు, వాటర్ బాటిల్స్ అందజేశారు సాయంత్రం గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే, 51వవార్డు అంబేడ్కర్ కాలనీ శ్రీ పైడిమాంబ ఆలయంలో ప్రధాన పండుగను మంగళవారం ఘనంగా జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు దర్శనాలు కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


అమ్మవారు

'ఉద్యోగులకు న్యాయం చేయాలి'

అక్కయ్యపాలెం, జూన్ 18: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలను సరి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు కోరారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సమస్యలు పరిష్కరించి, సామాజిక న్యాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు, ఏపీ రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్‌కు అభినందనలు తెలిపారు.

ఏపీ పీజీ సెట్‌లో దేదీప్యకు 10వ ర్యాంకు

కూర్మన్నపాలెం,జూన్ 18: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ నిర్వహించిన ఏపీ పీజీ సెట్‌లో కణితి నిర్వాసిత కాలనీ ఎరుకుల వీధికి చెందిన దాసరి దేదీప్య బయో టెక్నాలజీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో పదో ర్యాంకు సాధించింది. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో దేదీప్య బయోటెక్నాలజీ ఉత్తీర్ణురాలై ప్రవేశ పరీక్ష రాసింది. ఆమె తండ్రి దాసరి శ్రీనివాస్ స్టీల్ ప్లాంట్‌లో మార్కెటింగ్ విభాగం మేనేజర్‌గా పని చేస్తున్నారు.తల్లి వరలక్ష్మి గృహిణి. చదువు పూర్తయ్యాక మంచి ఉద్యోగం సాధించాలన్నదే తన లక్ష్యమని దీదీప్య తెలిపింది.


దాసరి దేదీప్య

చెత్తను తొలగించేదెన్నడో..?

- చైతన్యనగర్- మద్దిలపాలెం మార్గంలో అవస్థలు

సీతమ్మధార, జూన్ 18: గ్రేటర్ విశాఖ 23వ వార్డు చైతన్యనగర్, మద్దిలపాలెం రోడ్డులో గెడ్డ కాలువల్లో తొలగించిన చెత్తా చెదారం రోడ్డుపైనే కుప్పలుగా వేసి వదిలివేశారు. వారం దాటుతున్న తరలించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇ బ్బందులు ఎ దుర్కొంటున్నారు. భరించలేని దుర్గంధంతోపాటు రోడ్డుపై ప్రయాణించేవారు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఇలా చెత్త కుప్పలు పేరుకుపోవడంతోపాటు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాగే, స్థానికులు కూడా రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు. వీటిని మూడు నాలుగు రోజులుగా ఎత్తటం లేదు. గెడ్డ కాలువలోనుంచి తీసిన చెత్తను తొలగించక సమస్యలు తలెత్తుతున్నాయి.సంబంధిత అధికారులు, జీవీఎంసీ శానిటరీ సిబ్బంది తక్షణమే స్పందించి చెత్త కుప్పలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.


మద్దిలపాలెం రోడ్డులో అడ్డంగా వదిలివేసిన చెత్త కుప్పలు


ఇళ్ల ఎదుట దుస్థితి..

వందేభారత్‌లో హోం మంత్రి అనిత ప్రయాణం

- విశాఖ నుంచి విజయవాడకు పయనం
- ప్రయాణికులకు కుశల ప్రశ్నలు

నక్కపల్లి, జూన్ 18: రాష్ట్ర హోం మంత్రిగా వంగలపూడి అనిత బాధ్యతలు చేపట్టిన మరుక్షణం నుంచి పాలనలో తనదైన మార్క్ కనిపించేలా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, శాంతి భద్రతల పరిరక్షణ, మహిళల భద్రతకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. అలాగే మంగళవారం వందే భారత్ రైలులో విజయవాడ వెళ్లారు. విశాఖ నుంచి మంగళవారం ఉదయం వందేభారత్ రైలులో ప్రయాణిస్తూ తోటి ప్రయాణికులను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులు ఆమెతో ఫొటోలు దిగారు. రైలు ప్రయాణికులకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు వస్తే వాటిని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకు వెళతానని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు.


రైలులో ప్రయాణికులతో హోం మంత్రి అనిత

రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం అమరావతిలో రెండున్నరేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తిచేస్తామని, విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని ప్రకటించడంతో అటు అమరావతి, ఇటు విశాఖపట్నం రెండు నగరాల్లోను ఫ్లాట్లు, ఇళ్ల స్థలాలను కొనుగోలు చేయడానికి చాలామంది ఆసక్తి చూపుతున్నారు. అయితే విశాఖపట్నంలో ఊహించని విధంగా పెరిగిపోయిన భూముల రేట్లు, ఫ్లాట్ల ధరలు ఏమైనా తగ్గుముఖం పడతాయా?...అని కొనుగోలుదారులు ఎదురుచూస్తున్నారు. నాలుగేళ్ల క్రితం విశాఖపట్నం నుంచి హైదరాబాద్, భువనేశ్వర్ వంటి నగరాలకు వెళ్లిపోయిన రియల్ ఎస్టేట్ సంస్థలు మళ్లీ విశాఖపట్నంలో ప్రాజెక్టులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

గ్రేటర్‌లో గడగడ

... 5వ పేజీ తరువాయి

అధికారం చేపట్టడంతో జీవీఎంసీలో సమీకరణాలు శరవేగంగా మారిపోతున్నాయి. వైసీపీకి చెందిన కార్పొరేటర్లు చాలామంది కూటమి పార్టీల్లో చేరిపోయేందుకు ఆసక్తి చూపుతున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే కొంతమంది తెలుగుదేశం, జనసేన పెద్దలతో టచ్‌లోకి వెళ్లారని, అయితే మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు నాలుగేళ్ల గడువు అడ్డంకిగా మారడంతో వేచిచూస్తున్నారని చర్చ జరుగుతోంది. మేయర్లు, ఛైర్మన్ల అవిశ్వాసం గడువుపై అసెంబ్లీలో నిర్ణయం తీసుకోగానే జీవీఎంసీ మేయర్ కూడా మారిపోతారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే గత మూడేళ్లలో కౌన్సిల్‌లో తీసుకున్న ప్రధాన నిర్ణయాలు, అవినీతి ఆరోపణలు, విమర్శలు ఎదురైన అంశాలను తిరగదోడడంతోపాటు జీవీఎంసీ నిధుల ఖర్చులో జరిగిన అక్రమాలను వెలికి తీయాలని కూటమి పార్టీల పెద్దలు భావిస్తున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన సమాచారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడు తున్నారు. అవినీతి, అక్రమాలకు సంబంధించిన ప్రాథమిక సమాచారం చేతికి అందగానే దర్యాప్తు జరిపించడం ఖాయమని చెబుతున్నారు. ఈ పరిణామం జీవీఎంసీ పాలకవర్గంలోని వైసీపీ పెద్దలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

స్టాంపు పేపర్ల కొరత

... 5వ పేజీ తరువాయి

సరిగ్గా అమలు చేయడం లేదు. దాంతో వెండర్లు ప్రతి ఈ-స్టాంపు పేపరు అమ్మకంపై రూ.20 నుంచి రూ.30 అధికంగా తీసుకున్నారు. పది రూపాయల స్టాంపునకు రూ.10, రూ.20, రూ.50 స్టాంపులకు అదనంగా రూ.20, అదే వంద రూపాయల స్టాంపు అయితే రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. ఇలా ఎక్కువ మొత్తం పెట్టినా కొన్ని చోట్ల ఇవి వెంటనే దొరకడం లేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్యూలో నిల్చుంటే తప్ప లభించడం లేదు. దీంతో వీటిపై చాలామంది ఆసక్తి చూపడం లేదు. కొన్ని కేంద్రాల్లో ఫ్రాంకింగ్ మెషిన్లు పనిచేయడం లేదు. ఈ కారణాలతో చాలా మంది పాత స్టాంపు పేపర్ల కొనుగోలుకే ఆసక్తి చూపుతున్నారు.

తక్కువ ఖరీదు అందుబాటులో ఉన్నాయి

వంద రూపాయల స్టాంపు పేపర్లు తప్పితే మిగిలిన పది, ఇరవై, యాభై రూపాయల స్టాంపు (పాతవి) పేపర్లు అందుబాటులో ఉన్నాయని నగరంలోని ఓ సబ్ రిజిస్ట్రార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ-స్టాంపింగ్ వల్ల ఇబ్బంది ఏమీ లేదని, పాడైన ఫ్రాంకింగ్ మెషిన్లపై ఉన్నతాధికారులు ఏజెన్సీతో మాట్లాడి బాగు చేయిస్తున్నారని, రెండు రోజుల్లో అన్నీ అందుబాటులో ఉన్నాయన్నారు

గంజాయిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

లభ్యమవుతోందనే వివరాలను సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటారు. అలాగే నగరంలో గంజాయి వినియోగం జరుగుతున్న ప్రాంతాలు, విక్రయిస్తున్న ప్రాంతాలు, దుకాణాలపై నిరంతరం నిఘా ఉండేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోనూ ప్రత్యేకంగా యాక్షన్ టీమ్‌లను ఏర్పాటుచేయాలని డీసీపీలను ఆదేశించారు. యాక్షన్ టీమ్‌లు నిరంతరం తమ పరిధిలోని ప్రాంతాల్లో తిరుగుతూ గంజాయి వినియోగిస్తున్న యువతపై నిఘా పెడతాయి. అలాగే గంజాయి, మత్తుమందుల వినియోగం వల్ల తలెత్తే సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వీలుగా కళాశాలల్లో సదస్సులు నిర్వహించాలని సీపీ నిర్ణయించారు. దీనిని వంద రోజులపాటు పక్కాగా అమలుచేస్తే నగరంలో గంజాయి లేకుండా చేయవచ్చునని సీపీ ఆశాభావం వ్యక్తంచేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు.

ఆరుబయట మద్యం తాగితే చర్యలు : ఎస్ఐ

కంచరపాలెం, జూన్ 18 : గంజాయి సేవనం, ఆరుబయట మద్యం తాగే వారి కట్టడికి కంచరపాలెం పోలీసులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కంచరపాలెం పరిధి రైల్వే క్వార్టర్స్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి పలువురిని అదుపులోకితీసుకున్నారు. వారి కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రైవ్‌లో పాల్గొన్న ఎస్ఐ దివ్యభారతి మాట్లాడుతూ హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు సీపీ, డీసీపీ పర్యవేక్షణలో ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించినట్టు చెప్పారు. రోజూ తనిఖీ నిర్వహించి అసాంఘికపనులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.


కంచరపాలెం రైల్వే క్వార్టర్స్ పరిసరాల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి: ఆర్‌జేడీ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

కంచరపాలెం, జూన్ 18 : బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పేలా చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ బి.విజయభాస్కర్ ఆదేశించారు. జిల్లా శాఖ అధికారి వారి కార్యాలయంలో ఆయన మంగళవారం డీఈవో, ఎంఈవోలు, సోషల్ వెల్ఫేర్, ఐసీడీఎస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయ న మాట్లాడారు. 'నేను బడికి పోతా..' కార్యక్రమంలో భాగంగా బడి బయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించడానికి జూన్ 13 నుంచి జులై 12 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండలస్థాయిలో ఎంఈవోలు సీఆర్పీలతో కమిటీలుగా బడిబయట పిల్లలను శతశాతం గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నా రు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లల వివరాలను సమీప పాఠశాల్లో నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బడికి పోతా..ప్రత్యేక డ్రైవ్‌కు సంబంధించి షెడ్యూల్, రోజూ వారి కార్యాచరణ తదితర అంశాలను ఎంఈవోలకు వివరించారు. డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతు జిల్లాలో ప్రతి పిల్లాడు బడిలో ఉండేటట్టు చర్యలు తీసు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 8మండలాల ఎంఈవోలు పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



శ్రీవారికి చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 18: ఎన్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. వేంకటేశ్వరస్వామిని వేదపండితులు పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పుష్పాలు, నగలతో అలంకరించి స్నపన తిరుమంజసం, కుంభారాధనతో పాటు పూజలు జరిపారు. అనంతరం దివ్యక్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కొలనులో వేదపండితులు భక్తుల గోవింద నామస్మరణ మధ్య శ్రీవారికి చక్రస్నానం చేశారు. పూజల్లో ఎన్టీబీఎల్ చైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు దంపతులు, ట్రస్టీలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

అగనంపూడి: ఇక్కడి శాంతినగర్‌లో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దివ్య తిరు కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు సంప్రదాయబద్ధంగా శ్రీవారి కల్యాణాన్ని జరిపారు. పలువురి జంటలు కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల ఈకే చారి, కమిటీ ప్రతినిధులు నరసింగరావు, సాయిబునాయుడు, ఉమామహేశ్వరరావు, సోమశేఖర్, మోహిని, నాగలక్ష్మి, గురునాథ్, సత్యనారాయణ, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 18: ఉక్కు కర్మాగారం లో పల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరుతూ పలువురు కార్మికులు మంగళవారం యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. ప్లాంట్‌లో బీఎఫ్ విభాగం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ క్రమంలో ఇక్కడ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని పేర్కొన్నారు. ఎప్పటి నుంచో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బొర్రమాంబ ఆలయంలో పూజలు

అగనంపూడి, జూన్ 18: అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత బొర్రమాంబ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి పూజలు చేయగా, పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి బొర్రమాంబను దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్రనాయ పారాయణాలను పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్రా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్రా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **మ్యూజిక్ షాపు మూర్తి:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **సత్యభామ :** సంగం, శ్రీకన్య (గాజువాక)
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **గం గం గణేశా :** వెంకటేశ్వర, శ్రీకన్య (గాజువాక)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 55, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 40, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 52, బీరకాయలు 48, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 24, క్యారెట్ 30, దొండకాయలు 34, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 170, మునక్కాడలు (కిలో) 80, బరబాటి 64, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 140, పొటల్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 40, కంద 60, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 128
ఫారం ధర	-- 148
విత్ స్కిన్	-- 266
స్కిన్‌లెస్	-- 276

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

పాత గాజువాక కూడలిలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు

సమీపంలోనే పోలీస్ అవుట్ పోస్ట్ ఉన్నా పట్టించుకోని సిబ్బంది

కొరవడిన సీపీ ఏర్పాటు చేసిన ట్రాఫిక్ స్ట్రెచ్ మేనేజ్‌మెంట్ పర్యవేక్షణ

గాజువాక, జూన్ 18: ట్రాఫిక్ పరమైన ఇబ్బందులను తొలగించేందుకు నగర పోలీస్ కమిషనర్ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ట్రాఫిక్ స్ట్రెచ్ మేనేజ్‌మెంట్ ఆచరణకు నోచుకోవడం లేదు. పాత గాజువాక సర్కిల్‌లో నాలుగు హోటళ్లు ఉండగా, వాటికి వచ్చిన వారంతా తమ ద్విచక్ర వాహనాలను ఏకంగా ప్రధాన రహదారిపైనే గంటలకొద్దీ పార్కింగ్ చేసి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్ర స్థాయిలో తలెత్తుతున్నాయి. ఆయా హోటళ్లకు వచ్చిన వారంతా రోడ్డు మొత్తం తమ ద్విచక్ర వాహనాలతో నింపేస్తున్నా.. ఎదురుగా ఉన్న ట్రాఫిక్ అవుట్ పోస్టు సిబ్బంది తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలను తావిస్తున్నది. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఈ పరిస్థితి తీవ్ర స్థాయిలో ఉంటున్నప్పటికీ ట్రాఫిక్ పోలీసులు సంబంధిత హోటళ్ల నిర్వాహకులపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి.

ఇష్టారాజ్యంగా ఆయా హోటళ్ల వద్ద పార్కింగ్ చేస్తున్న వారిపై వారు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఆయా హోటళ్ల వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సర్కిల్‌లో ఉన్న ట్రాఫిక్ అవుట్ పోస్టుకు సీఐలు, ఎస్ఐలు రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వచ్చి ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నా.. ఆయా హోటళ్ల వద్ద తలెత్తుతున్న ఇబ్బందుల పట్ల ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.



పాత గాజువాక సర్కిల్‌లోని రోడ్డుపై ఇష్టానుసారంగా పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

ఆచరణకు నోచుకోని సీపీ ఆశయం

గాజువాక ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు గాను సీపీ రవిశంకర్ అయ్యన్నార్ షీలానగర్ నుంచి పాత గాజువాక కూడలి వరకు రహదారులపై ఎలాంటి వాహనాలు పార్కింగ్ చేయకుండా పర్యవేక్షించేందుకు గాను ట్రాఫిక్ స్ట్రెచ్ మేనేజ్‌మెంట్ పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. అయితే పాత గాజువాక సర్కిల్‌లోని రోడ్డుపై ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతుంటూ ఈ స్ట్రెచ్ మేనేజ్‌మెంట్ ఏం చేస్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్న వారితో పాటు పార్కింగ్ కోసం స్థలం కేటాయించకుండా వ్యాపారాలు సాగించే హోటళ్లు, ఇతర సంస్థలపై తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పల్లా శ్రీనివాసరావుకు అభినందనల వెల్లువ

టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులతో కిటకిటలాడిన పార్టీ కార్యాలయం

గాజువాక /ఉక్కుటౌన్‌షిప్, జూన్ 18: తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపేందుకు అధిక నాయకులు, నాయకులు, కార్యకర్తలు, పలు కార్మిక సంఘాల నాయకులు, ప్రజలు తరలిరావడంతో పాత గాజువాకలోని టీడీపీ కార్యాలయం కిటకిటలాడింది. గాజువాక ప్రాంతం నుంచే కాకుండా విశాఖతో పాటు ఇతర జిల్లాల నుంచి నాయకులు, కార్యకర్తలు విచ్చేసి పల్లాకు అభినందనలు తెలిపారు. అదే విధంగా పోలీస్ అధికారులు, రెవెన్యూ, వివిధ విభాగాల ఉద్యోగులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఉక్కు కర్మాగారానికి అండగా ఉండాలని, ప్రైవేటీకరణ కాకుండా చూడాలని కోరుతూ సీఐటీయూ ప్లాంట్ నాయకులు జె.అయోధ్యరాం, వైటీ దాసు, రామస్వామి, తదితరులు పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. వీవీవీ స్కూల్‌లో ప్రస్తుతం నెలకొన్న సమస్యను పరిష్కరించాలంటూ పాఠశాల ఉపాధ్యాయులు ఆయనకు వినతిపత్రం అందించారు. అలాగే రాష్ట్ర భాషోపాధ్యాయ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు ఆర్కే మాస్టారు పల్లాకు పుష్పగుచ్ఛం అంజేసి అభినందనలు తెలిపారు.



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు కార్మిక సంఘ నాయకులు

పెందుర్తి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మండల, వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలు నగరంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ 96వ వార్డు అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు పల్లాకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. నాయకులు పీబీఎస్ఎన్ బుచ్చిరాజు, కోరిబిల్లి సుందరరావు, ప్రకాశ్, రెడ్డి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు నగరంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు, ఇతర ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

కూటమి కార్యకర్తలు తలెత్తుకునేలా చేస్తా

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

పెందుర్తి, జూన్ 18: రాష్ట్రంలో సుస్థిరత ప్రభుత్వం ఏర్పాటుకు కూటమి కార్యకర్తలే కారణమని, వారి గౌరవం తగ్గకుండా తలెత్తుకునేలా చేస్తానని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. స్థానిక తాండ్రపాపారాయుడు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ కూటమి కార్యకర్తల ఆత్మీయ విజయోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ కార్యకర్తల మనోభావాలను గుర్తిస్తామన్నారు. ఇతరులు కూటమిలో చేరుతారన్న ప్రచారం ఊహాజనితమని, ఎవరు పడితే వారు వచ్చి చేరేందుకు కూటమి ఏమీ డంపింగ్ యార్డు కాదని, తమది చారిత్రాత్మక పొత్తు అని అన్నారు. పెందుర్తిలో త్వరలో ఇల్లు కట్టుకుంటానని, ప్రజలకు సేవ చేసి వారి రుణం తీర్చుకుంటానన్నారు. కార్యకర్తలు పిలిస్తే పలుకుతానని, వారి సమస్యలను పరిష్కరించడం బాధ్యతగా తీసుకుంటానన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ ఎంపీ సీఎం రమేశ్ పెద్దన్నలా వ్యవహరించడం వల్లే అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజవర్గాల్లో గెలుపు సాధ్యమైందన్నారు. పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధికి అధికంగా నిధులు వెచ్చించవలసిందిగా కోరారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. అనంతరం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కోరుపోలు రాము నాయుడు ఆధ్వర్యంలో, ఎంపీ, ఎమ్మెల్యేలను పలువురు కూటమి నాయకులు గజమాలతో వేసి దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.



ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే పంచకర్లను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న కూటమి నాయకులు

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ నియోజవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, నాయకులు రెడ్డి నారాయణరావు, ముదునూరి రాజాసుధాకర్, ఆయిత సింహాచలం, సుఖవాసి అజయ్, గొర్లె అప్పారావు, జ్యోతి, పిన్నింటి పార్వతి, తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభనగర్ టిడ్కో ఇళ్ల వద్ద అధికారులతో మాట్లాడుతున్న గణబాబు



ములగాడలో టిడ్కో ఇళ్ల వద్ద అధికారులతో మాట్లాడుతున్న గణబాబు

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, జూన్ 18: టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అధికారులను ఆదేశించారు. 89, 92 వార్డుల పరిధిలోని పద్మనాభనగర్, కొత్తపాలెం ప్రాంతాల్లో జీవీఎంసీ అధికారులతో పాటు మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పద్మనాభనగర్‌లో నిర్మించిన టిడ్కో ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసినా, మౌలిక వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలోకి రాకపోవడాన్ని గుర్తించారు. వెంటనే తాగునీరు, విద్యుత్ సరఫరా కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కొత్తపాలెంలోని అప్పలనరసయ్య కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్, టీడీపీ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కనీసం నీటి వసతి కల్పించకపోవడం సిగ్గుచేటు

మల్కాపురం: నాడు టీడీపీ హయాంలో అచ్చినాయుడుతోటలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లల్లో కనీసం తాగునీటి సదుపాయం కల్పించలేకపోవడం సిగ్గుచేటు అని ఎమ్మెల్యే గణబాబు విమర్శించారు. మంగళవారం సాయంత్రం ములగాడ, అచ్చినాయుడుతోటలో నిర్మించిన టిడ్కో ఇళ్లను పరిశీలించారు. అనంతరం టిడ్కో, జీవీఎంసీ అధికారులతో ఆయన మాట్లాడారు. ఇక్కడ యజ్ఞాలు, యాగాలు చేసినంత మాత్రన అభివృద్ధి చేసినట్టు కాదని విమర్శించారు. అప్పట్లో తాము నిర్మించిన ఇళ్లకు గత వైసీపీ ప్రభుత్వం రంగులు వేసిందే తప్ప ఇతర వసతులు కల్పించలేదని మండిపడ్డారు. తన హయాంలోనే ఈ ఇళ్ల నిర్మాణానికి అంకుర్పారణ చేశానని, త్వరలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఎంతో పటిష్టంగా నిర్మించిన ఈ ఇళ్లను నాడు తాము గుర్తించిన లబ్ధిదారులకే కేటాయించారా, లేక ఇంకెవరికైనా మంజూరు చేశారన్న దానిపై వివరాలు సేకరిస్తున్నామని గణబాబు పేర్కొన్నారు.

మంచినీటి సదుపాయం కోసం ప్రణాళికలు

గాజువాక సుందరయ్యకాలనీ నుంచి అచ్చినాయుడు తోట వరకు మంచినీటి పైప్‌లైన్లు వేయడంతో పాటు ఇక్కడ ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని గణబాబు పేర్కొన్నారు. ఇందుకోసం రూ.5.50 కోట్లు కేటాయించడం జరిగిందనారు. అలాగే విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ గల్లా చిన్నా, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, కూటమి నాయకులు మజ్జి సోమేశ్, మజ్జి మాలినాయుడు, కోరాడ శ్రీనివాసరావు, విశ్వనాథుల దినకర్, మాజీ కార్పొరేటర్ ఉమామహేశ్వరి, పొట్టిమూర్తి, తదితరులు ఉన్నారు.



86వ వార్డు ద్వారకాపురి కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

రహదారిపై పారుతున్న మురుగు

86వ వార్డులో శిథిలావస్థకు చేరుకున్న కాలువలు

జీవీఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి

కూర్మన్నపాలెం, జూన్ 18: జీవీఎంసీ 86వ వార్డు పరిధి ద్వారకాపురి కాలనీలో పలు కాలువలు శిథిలావస్థకు చేరడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. దీంతో కాలనీవాసులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కాలువల్లో ఎక్కడికక్కడ మురుగు నీరు తిష్ట వేయడంతో పాటు రోడ్లపై పారుతున్నందున తీవ్ర దుర్వాసనతో నానాపాట్లు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దీనికితోడు దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో జ్వరాలు, వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అందువల్ల జీవీఎంసీ అధికారులు స్పందించి కాలువలను ఆధునీకరించడంతో పాటు మురుగు నీరు రోడ్లపై పారకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

న్యూపోర్టు సీఐ దాలిబాబు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ దాలిబాబు

పెదగంట్యాడ, జూన్ 18: మాదక ద్రవ్యాలు యువతను నిర్వీర్యం చేస్తాయని, అందువల్ల వీటికి దూరంగా ఉండాలని న్యూపోర్టు శాంతిభద్రతల విభాగం సీఐ దాలిబాబు సూచించారు. ప్రపంచ మాదకద్రవ్యాల వినియోగ నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వికాస్‌నగర్ నగర్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గంజాయి, నల్లమందు, ఇతర డ్రగ్స్‌ను వాడడం వల్ల శారీరకంగా అనేక రుగ్మతలు తలెత్తుతాయని, ఒక్కోసారి ప్రాణాపాయం కూడా సంభవిస్తుందన్నారు. అందువల్ల యువతరం వీటికి దూరంగా ఉండాలన్నారు. యువత సన్మార్గంలో పయనిస్తూ విద్య, ఉద్యోగం వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. తమ పిల్లల నడవడికపై తల్లిదండ్రులు కూడా ఓ కన్నేసి ఉంచాలని సీఐ దాలిబాబు కోరారు. కార్యక్రమంలో న్యూపోర్టు ఎస్ఐ శ్యామ్‌సుందర్, పలువురు యువకులు పాల్గొన్నారు.

నేవల్ పార్కు ప్రాంగణంలో నాగుపాము హల్‌చల్



పట్టుకున్న పాముతో నాగరాజు

సింధియా, జూన్ 18: ఇక్కడి నేవల్ పార్కు ప్రాంగణంలో గురువారం ఓ నాగుపాము హల్‌చల్ చేసింది. నూతనంగా నిర్మిస్తున్న భవనం స్టోర్ రూమ్‌లో బుసలు కొడుతున్న శబ్ధం వినిపించడంతో అక్కడ ఉన్న కొంతమంది కార్మికులు వెళ్లి చూసేసరికి నాగుపాము కనిపించడంతో వారు భయంతో పరుగులు తీశారు. ఈ విషయమై సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ నాగరాజు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని చాకచక్యంగా దానిని పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పామును యారాడ అటవీ ప్రాంతంలో నాగరాజు విడిచిపెట్టాడు.

వైభవంగా మోదకొండమ్మ పండుగ

గోపాలపట్నం, జూన్ 18: స్థానిక ఇందిరానగర్‌లో మోదకొండమ్మ పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ కమిటీ ప్రతినిధులు ముందుగా పూజలు జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించేందుకు ఉదయం నుంచే ఆలయం వద్ద బారులుతీరారు. వందలాది మంది భక్తులు మోదకొండమ్మ దర్శనార్థం తరలిరావడతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఎంత తీవ్రతకు భక్తులు ఇబ్బందులు పడకుండా కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.



గోపాలరెడ్డినగర్‌లో దుర్గాదేవి జాతర

గాజువాక: జీవీఎంసీ 76వ వార్డు గోపాలరెడ్డినగర్‌లో దుర్గాదేవి అమ్మవారి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పూజల్లో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, పలువురు నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చినకోరాడలో కుంచమాంబ ఉత్సవం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి చినకోరాడలో కుంచమాంబ ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు బాసెట్టి అప్పారావు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వేపగుంటలో పైడితల్లమ్మ..

వేపగుంట: వేపగుంట కూడలిలో పైడితల్లమ్మ మారువారం పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. గత వారం ప్రధాన పండుగ సమయంలో మొక్కులు చెల్లించుకోలేని భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

గురుమూర్తి స్మారక పురస్కారాల విజేతలు వీరే..

అగనంపూడి, జూన్ 18: కంచిపాటి గురుమూర్తి స్మారక కథలు, కవితల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారి వివరాలను మంగళవారం నిర్వాహకులు వెల్లడించారు. స్థానిక సీడబ్లూసీలో ఏర్పాటు చేసిన సమావేశంలో విజేతల వివరాలను ప్రకటించారు. కథలు, కవితల పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు అధిక సంఖ్యలో పాల్గొన్నట్టు యువ కవి వెంకట్ తెలిపారు. కథల విభాగంలో మౌనశ్రీ మల్లిక్, బసవేశ్వర్, కనకలక్ష్మి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సొంతం చేసుకున్నారు. అలాగే కవితల విభాగంలో రంగబాబు, గౌరీశంకర్, అరుణకుమారిలు వరుస మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఈ నెల 22న బహుమతులను అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

గోపాలపట్నం, జూన్ 18: ఫీడర్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా బాపూజీనగర్, టైలర్స్ కాలనీ, శ్రీరామ్‌నగర్, ప్రశాంతినగర్, గోపాలపట్నం బంక్ ఏరియా, గోపాలపట్నం మెయిన్ రోడ్డు, బాజీ జంక్షన్, సుసర్లాకాలనీ, బుచ్చిరాజుపాలెం, రెడ్డి వీధి, ఎస్సీ కాలనీ, విద్యానగర్, నేతాజీ వీధి, సింహాచలం రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.



కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో వేసిన సీసీ రోడ్డు

గతుకుల రోడ్డుకు మోక్షం

వేపగుంట, జూన్ 18: జీవీఎంసీ 94వ వార్డు పరిధి వెంకటసాయినగర్ నుంచి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే గతుకుల రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇక్కడి రోడ్డును గతంలో ఎన్‌సీసీ పైపు లైన్ పనుల కోసం తవ్వేశారు. ఆ తర్వాత మరమ్మతులు చేపట్టకపోవడంతో స్థానికులతో పాటు ఆలయానికి రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేయడంతో ఎట్టకేలకు ఎన్‌సీసీ కాంట్రాక్టు సిబ్బంది సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం పట్ల కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



ఆలయ సన్నిధిలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అక్కయ్యపాలెం, జూన్ 18: గ్రేటర్ 27వ వార్డు దొండపర్తిలోని దుర్గమ్మ జాతర మహోత్సవంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో అంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే అక్కయ్యపాలెంలో కుంచుమాంబ పండగ సందర్భంగా అమ్మవారిని స్థానిక నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, టీడీపీ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'మాజీ మంత్రి అమర్ ఓ అజ్ఞాని'

మహరాణిపేట, జూన్ 18: మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఓ అజ్ఞాని అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ విమర్శించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మిడిసిపడిన నేతలకు ఇటీవల జరిగిన ఎన్నికలలో ప్రజలు గుణపాఠం ఇచ్చేలా తీర్పుఇచ్చారన్నారు. మంత్రిగా అమర్‌నాథ్ ఎంత అవగాహనా రాహిత్యంతో మాట్లాడారో ప్రజలు గమనించారన్నారు. అనకాపల్లిలో మైనింగ్ మాఫియాకు ఆయన అధ్యక్షుడిగా వ్యవహరించారని విమర్శించారు. బడుగు వర్గాలకు చెందిన విస్సన్నపేట భూములను దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి రూ. 13 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయని అబద్ధాలు చెప్పి మోసం చేశారని అన్నారు. ఇప్పుడు రుషికొండపై నిర్మించిన భవనాలు ఏ విధంగా ఉపయోగించుకోవాలో ఉచిత సలహాలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. అమర్ అక్రమంగా చేసిన అమ్మోనియం నైట్రేట్ సరఫరాపై సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

పల్లా శ్రీనివాస్‌కు అభినందనలు



పల్లాకు పుష్పగుచ్ఛమిస్తున్న చక్రవర్తి దంపతులు, అభిమానులు

జ్ఞానాపురం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు టీడీపీ విశాఖ పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, జీవీఎంసీ 33వ వార్డ క్లస్టర్ ఇన్ చార్జ్, టీడీపీ రాష్ట్ర బీసీ గవర సామాజిక వర్గం సాధికారక సమితి సభ్యురాలు తిరుమల దేవి చక్రవర్తి దంపతులు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు నుంచి గాజువాక పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లి పాల్గొన్నారు. అనంతరం గాజువాకలో పల్లా శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు. 33వ వార్డు నాయకులు సింగంపల్లి మాధవి, ఎల్. కనకదుర్గ, సీహెచ్ వెన్నెల, జి. భరత్‌కుమార్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్: పల్లా శ్రీనివాస్‌ను 35 వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుతో పాటు బీసీ నాయకులు పార్టీ కార్యాలయంలో కలసి అభినందనలు తెలిపారు.





కేజీహెచ్ వద్ద గతంలో నిర్వహించిన అన్న క్యాంటీన్



లోపల భోజనాలకు వీలుగా ఉన్న ఫర్నిచర్

మళ్లీ పేదల ఆకలి తీర్చే దిశగా..

- సౌత్‌లో మూడు చోట్ల అన్నక్యాంటీన్ల పునః ప్రారంభానికి చర్యలు
- ఇప్పటికే భవనాలు శుభ్రం చేసే పనిలో జీవీఎంసీ యంత్రాంగం
- రోజువారి కూలీలు, ఇతర ప్రాంతాలనుంచి వచ్చే వారికి మేలు

డాబాగార్డెన్స్, జూన్ 18: పేదల ఆకలి తీర్చేందుకు మళ్లీ అన్న క్యాంటీన్లు సిద్ధమవుతున్నాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటిని పునఃప్రారంభించనున్నారు. దక్షిణ నియోజకవర్గంలో టర్నర్‌చౌల్ట్రీ, కేజీహెచ్, వన్‌టౌన్ పరిసర ప్రాంతాల్లో గతంలో వీటిని ఏర్పాటు చేశారు. అల్పాహారం 400 మందికి, మధ్యాహ్న భోజనం 500 మందికి, రాత్రి భోజనం 500 మందికి చొప్పున రోజూ మూడు పూటలా 1500 మందికి అతి తక్కువ ధరకు ఆహారం లభించేది. కార్మికులు, దినసరి కూలీలు, నిరుపేదలు లబ్ధిపొందారు. రూ.15తోనే రోజుగడవడానికి వీలయ్యేది. నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందడంతో అప్పట్లో ఈ అన్న క్యాంటీన్లకు మంచి ఆదరణ లభించింది.

వైసీపీ పాలనలో తొలగింపు..

ఐదేళ్ల కిందట వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ అన్న క్యాంటీన్లను తొలగించారు. ప్రస్తుతం ఈ భవనాల్లోని టేబుల్స్, కుర్చీలు పూర్తిగా పాడై మూలకు చేరాయి. రంగులు వెలసిపోయాయి. పిచ్చి మొక్కలు పెరిగిపోయి పరిసరాలు అధ్వానంగా మారాయి. ఈ భవనాలను కొంత మంది ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలకు వేదికలుగా మారాయి. అయితే, వీటిలో కొన్నింటిని సచివాలయాలుగా వినియోగిస్తున్నారు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో అధ్వాన స్థితిలో ఖాళీగా వదిలేసిన ఈ భవనాలను మరమ్మతులు చేపట్టి రంగులు వేసి గతంలో మాదిరిగానే అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకుంటున్నారు.



టర్నర్‌చౌల్ట్రీ వద్ద అన్న క్యాంటీన్ భవనం

సూర్యాబాగ్..కేజీహెచ్..కురుపాం మార్కెట్‌లలో అన్న క్యాంటీన్లు గతంలో నిర్వహించారు. అలాగే, సూర్యాబాగ్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్మించిన అన్న క్యాంటీన్ త్వరలోనే ప్రారంభానికి సిద్ధం కానుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. పేదలకు రూ.5కే ఆహారం అందించాలనే ఉద్దేశంతో గతంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నగరంలో 25 అన్నక్యాంటీన్లు ప్రారంభించగా, దక్షిణ నియోజకవర్గంలో తొలుతగా ప్రారంభించిన వాటిలో సూర్యాబాగ్‌లో అన్నక్యాంటీన్ ఒకటి. నగరం మధ్యలో ఉన్న ఈ క్యాంటీన్ జగదాంబ, డాబాగార్డెన్స్, పూర్ణామార్కెట్ ప్రాంతాలకు వెళ్లేవారికి సౌలభ్యంగా ఉండేది. రోడ్డుపైనే అందుబాటులో ఉండటంతో నిరుపేదలు ఎంతో మందికి ఆకలి తీర్చేది. ఇప్పుడు మళ్లీ అందుబాటులోకి వస్తుండడంతో పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

బృహత్తర కార్యక్రమం..



దక్షిణ నియోజకవర్గంలోని 100 రోజుల ప్రణాళికలో భాగంగా అన్న క్యాంటీన్లన్ల ఏర్పాటుకుసన్నద్ధమవుతున్నాం. ఇక్కడ ఎక్కువ మంది రోజు వారీ కూలీలతోపాటు కేజీహెచ్, ఇతరత్రా ఆస్పత్రులకు వచ్చేవారు, అనేక పనులపై టౌన్‌కు వచ్చేవారికి భోజనం చేసే అవకాశం కలుగుతుంది. అన్నక్యాంటీన్ల ఏర్పాటు ద్వారా పేదల ఆకలితీర్చేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయం.

- వంశీకృష్ణ, ఎమ్మెల్యే

పేదల ఆకలి తీరుతుంది



అన్నక్యాంటీన్‌ల ద్వారా పేద, మధ్య తరగతి వారికి ఉపయోగకరం. కేవలం రూ.5 భోజనంతో దూర భారం నుంచి వస్తున్న వారికి ఎంతో మేలు. అనేక పనులపై ఇతర ప్రాంతాల నుంచి వస్తుంటారు. హోటళ్లలో భోజనం చేయాలంటే ఖరీదైన వ్యవహారం. పేదలకు అందుబాటు ధరలో అన్న క్యాంటీన్లతో ఆకలి తీరుతుంది.

- సింహాచలం, పాదచారుడు

100 రోజుల ప్రణాళిక



100 రోజుల ప్రణాళికాలో భాగంగా దక్షిణ నియోజకవర్గంలో అన్న క్యాంటీన్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. ఆయా క్యాంటీన్ల మరమ్మతు, ఇతరత్రా మౌలిక సదుపాయాలపై పూర్తి స్థాయి ఆదేశాలు రావాలి. నిధులు కేటాయించాల్సి ఉంది. టర్నర్‌చౌల్ట్రీ వద్ద అన్నక్యాంటీన్, కేజీహెచ్, కురుపాం మార్కెట్ వద్ద అన్నక్యాంటీన్లను ఇప్పటికే శుభ్రపరిచే పనులను సైతం ప్రారంభించాం.

- జోన్ 4 జోనల్ కమిషనర్ , పీవీవీడీ ప్రసాద్

ఇంటర్నేషనల్ రిఫరీ సూర్యనారాయణకు సన్మానం

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 17: ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ రిఫరీ నగరానికి చెందిన కంచరాన సూర్యనారాయణకు అరుదైన గౌరవం దక్కింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ప్రారంభమైన ఖేలో ఇండియా జోన్-సీ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో రిఫరీగా వ్యవహరించేందుకు వెళ్లిన ఆయనను, భారత వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య, టోర్నీ నిర్వాహక ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య సీనియర్ ఉపాధ్యక్షుడిగా రాష్ట్ర, జిల్లా సంఘాల అధ్యక్ష కార్యదర్శునిగానే కాకుండా అంతర్జాతీయ రిఫరీగా క్రీడారంగానికి సూర్యనారాయణ చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు.



సత్కరిస్తున్న వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య ప్రతినిధులు

విశ్వ విద్యాలయాలను ప్రక్షాళన చేయాలి

సీతంపేట, జూన్ 18: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావును ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విశ్వ విద్యాలయాలు ప్రక్షాళన చేయాలని కోరారు. అధికారిక ఓఎస్డీలను నియమించాలని, విశ్వ విద్యాలయాలలో బోధన, బోధనేతర సిబ్బందిని, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను తక్షణమే భర్తీకి నోటిఫికేషన్ విడుదలకు చొరవ తీసుకోవాలని కోరారు. త్వరలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించాలని, పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఐక్య విద్యార్థి ఫ్రంట్ అధ్యక్షుడు ఎం. శాంతిభూషణ్, కిసాన్ మోర్చా జిల్లా సెక్రటరి పొట్నూరి వెంకట కృష్ణారావు, జింజలూరి గోవిందు, వాసుపల్లి రాంబాబు, సనపల తిరుపతిరావు, రూప, రజిని తదితరులు పల్లా శ్రీనివాసరావు దృష్టికి పలు సమస్యలు తీసుకువెళ్లారు. ఈవిషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని పల్లా హామీ ఇచ్చారు.



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుని సత్కరిస్తున్న హేమంత్‌కుమార్

జాతి ఐక్యతకు భంగం కలిగే ప్రసంగాలు సరికావు

» నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉప కులపతి ఆచార్య బాలమోహన్‌దాస్

సీతమ్మధార, జూన్ 18: జాతి ఐక్యతకు భంగం కలిగేలా, విద్వేసాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేయడం ఏ మాత్రం సరికాదని నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి, గాంధీ సెంటర్ అధ్యక్షులు ఆచార్య బాలమోహన్‌దాస్ పేర్కొన్నారు. ఐక్య రాజ్య సమితి ఏటా జూన్ 18న అంతర్జాతీయ అసందర్భ ప్రసంగాల ప్రతిఘటన దినంగా ప్రకటించిన నేపథ్యంలో బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్ నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియన్స్ ఫ్రీడమ్ సంస్థలు అనుచితరీతి ప్రసంగాలను ప్రతిఘటించండి అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను ముఖ్య అతిథిగా బాలమోహన్‌దాస్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఫౌండేషన్ సంస్థ ఛైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూప్రజలను జాగ్రతం చేయాలని సంకల్పంతో ఈ నెల ఆదివారం 23న బుల్లయ్య కళాశాలలో ఈఅంశంపై సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో విద్యావేత్తలు, మతపెద్దలు పాల్గొని అభిప్రాయాలు తెలుపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజ్ఞాన్‌కుమార్, అబ్దుల్ మునిర్ బాషా, డాక్టర్ సత్యమూర్తి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాలమోహన్‌దాస్, తదితరులు

ఘనంగా కుంచుమాంబ అమ్మవారి పండుగ

మురళీనగర్, జూన్ 18 ; మాధవధారలో మంగళవారం గ్రామ దేవత శ్రీ కుంచుమాంబ అమ్మవారి వార్షిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి పాత రామాలయం వద్ద అమ్మవారి శతకం పట్టు వద్ద భక్తులు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ మాధవ యువజన సమాజం అధ్వర్యంలో ఈ మహోత్సవాలు నిర్వహించారు. వేడుకల్లో మాదవధార మానవసేవే మాధవసేవ అసోసియేషన్ సభ్యులు హాజరైన భక్తులకు ప్రసాదాలు, వాటర్ బాటిల్స్ అందజేశారు సాయంత్రం గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే, 51వవార్డు అంబేడ్కర్ కాలనీ శ్రీ పైడిమాంబ ఆలయంలో ప్రధాన పండుగను మంగళవారం ఘనంగా జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు దర్శనాలు కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



అమ్మవారు

'ఉద్యోగులకు న్యాయం చేయాలి'

అక్కయ్యపాలెం, జూన్ 18: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలను సరి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు కోరారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సమస్యలు పరిష్కరించి, సామాజిక న్యాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు, ఏపీ రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్‌కు అభినందనలు తెలిపారు.

ఏపీ పీజీ సెట్‌లో దేదీప్యకు 10వ ర్యాంకు

కూర్మన్నపాలెం,జూన్ 18: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ నిర్వహించిన ఏపీ పీజీ సెట్‌లో కణితి నిర్వాసిత కాలనీ ఎరుకుల వీధికి చెందిన దాసరి దేదీప్య బయో టెక్నాలజీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో పదో ర్యాంకు సాధించింది. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో దేదీప్య బయోటెక్నాలజీ ఉత్తీర్ణురాలై ప్రవేశ పరీక్ష రాసింది. ఆమె తండ్రి దాసరి శ్రీనివాస్ స్టీల్ ప్లాంట్‌లో మార్కెటింగ్ విభాగం మేనేజర్‌గా పని చేస్తున్నారు.తల్లి వరలక్ష్మి గృహిణి. చదువు పూర్తయ్యాక మంచి ఉద్యోగం సాధించాలన్నదే తన లక్ష్యమని దీదీప్య తెలిపింది.



దాసరి దేదీప్య

చెత్తను తొలగించేదెన్నడో..?

» చైతన్యనగర్- మద్దిలపాలెం మార్గంలో అవస్థలు

సీతమ్మధార, జూన్ 18: గ్రేటర్ విశాఖ 23వ వార్డు చైతన్యనగర్, మద్దిలపాలెం రోడ్డులో గెడ్డ కాలువల్లో తొలగించిన చెత్తా చెదారం రోడ్డుపైనే కుప్పలుగా వేసి వదిలివేశారు. వారం దాటుతున్న తరలించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భరించలేని దుర్గంధంతోపాటు రోడ్డుపై ప్రయాణించేవారు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఇలా చెత్త కుప్పలు పేరుకుపోవడంతోపాటు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాగే, స్థానికులు కూడా రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు. వీటిని మూడు నాలుగు రోజులుగా ఎత్తటం లేదు. గెడ్డ కాలువలోనుంచి తీసిన చెత్తను తొలగించక సమస్యలు తలెత్తుతున్నాయి.సంబంధిత అధికారులు, జీవీఎంసీ శానిటరీ సిబ్బంది తక్షణమే స్పందించి చెత్త కుప్పలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



మద్దిలపాలెం రోడ్డులో అడ్డంగా వదిలేసిన చెత్త కుప్పలు



ఇళ్ల ఎదుట దుస్థితి..

వందేభారత్‌లో హోం మంత్రి అనిత ప్రయాణం

- విశాఖ నుంచి విజయవాడకు పయనం
- ప్రయాణికులకు కుశల ప్రశ్నలు

నక్కపల్లి, జూన్ 18: రాష్ట్ర హోం మంత్రిగా వంగలపూడి అనిత బాధ్యతలు చేపట్టిన మరుక్షణం నుంచి పాలనలో తనదైన మార్క్ కనిపించేలా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, శాంతి భద్రతల పరిరక్షణ, మహిళల భద్రతకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. అలాగే మంగళవారం వందే భారత్ రైలులో విజయవాడ వెళ్లారు. విశాఖ నుంచి మంగళవారం ఉదయం వందేభారత్ రైలులో ప్రయాణిస్తూ తోటి ప్రయాణికులను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులు ఆమెతో ఫొటోలు దిగారు. రైలు ప్రయాణికులకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు వస్తే వాటిని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకు వెళతానని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు.



రైలులో ప్రయాణికులతో హోం మంత్రి అనిత

రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం అమరావతిలో రెండున్నరేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తిచేస్తామని, విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని ప్రకటించడంతో అటు అమరావతి, ఇటు విశాఖపట్నం రెండు నగరాల్లోను ప్లాట్లు, ఇళ్ల స్థలాలను కొనుగోలు చేయడానికి చాలామంది ఆసక్తి చూపుతున్నారు. అయితే విశాఖపట్నంలో ఊహించని విధంగా పెరిగిపోయిన భూముల రేట్లు, ప్లాట్ల ధరలు ఏమైనా తగ్గుముఖం పడతాయా?...అని కొనుగోలుదారులు ఎదురుచూస్తున్నారు. నాలుగేళ్ల క్రితం విశాఖపట్నం నుంచి హైదరాబాద్, భువనేశ్వర్ వంటి నగరాలకు వెళ్లిపోయిన రియల్ ఎస్టేట్ సంస్థలు మళ్లీ విశాఖపట్నంలో ప్రాజెక్టులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

గ్రేటర్‌లో గడగడ

... 5వ పేజీ తరువాయి

అధికారం చేపట్టడంతో జీవీఎంసీలో సమీకరణాలు శరవేగంగా మారిపోతున్నాయి. వైసీపీకి చెందిన కార్పొరేటర్లు చాలామంది కూటమి పార్టీల్లో చేరిపోయేందుకు ఆసక్తి చూపుతున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే కొంతమంది తెలుగుదేశం, జనసేన పెద్దలతో టచ్‌లోకి వెళ్లారని, అయితే మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు నాలుగేళ్ల గడువు అడ్డంకిగా మారడంతో వేచిచూస్తున్నారని చర్చ జరుగుతోంది. మేయర్లు, ఛైర్మన్ల అవిశ్వాసం గడువుపై అసెంబ్లీలో నిర్ణయం తీసుకోగానే జీవీఎంసీ మేయర్ కూడా మారిపోతారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే గత మూడేళ్లలో కౌన్సిల్‌లో తీసుకున్న ప్రధాన నిర్ణయాలు, అవినీతి ఆరోపణలు, విమర్శలు ఎదురైన అంశాలను తిరగదోడడంతోపాటు జీవీఎంసీ నిధుల ఖర్చులో జరిగిన అక్రమాలను వెలికి తీయాలని కూటమి పార్టీల పెద్దలు భావిస్తున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన సమాచారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడు తున్నారు. అవినీతి, అక్రమాలకు సంబంధించిన ప్రాథమిక సమాచారం చేతికి అందగానే దర్యాప్తు జరిపించడం ఖాయమని చెబుతున్నారు. ఈ పరిణామం జీవీఎంసీ పాలకవర్గంలోని వైసీపీ పెద్దలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

స్టాంపు పేపర్ల కొరత

... 5వ పేజీ తరువాయి

సరిగ్గా అమలు చేయడం లేదు. దాంతో వెండర్లు ప్రతి ఈ-స్టాంపు పేపరు అమ్మకంపై రూ.20 నుంచి రూ.30 అధికంగా తీసుకున్నారు. పది రూపాయల స్టాంపునకు రూ.10, రూ.20, రూ.50 స్టాంపులకు అదనంగా రూ.20, అదే వంద రూపాయల స్టాంపు అయితే రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. ఇలా ఎక్కువ మొత్తం పెట్టినా కొన్ని చోట్ల ఇవి వెంటనే దొరకడం లేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్యూలో నిల్చొంటే తప్ప లభించడం లేదు. దీంతో వీటిపై చాలామంది ఆసక్తి చూపడం లేదు. కొన్ని కేంద్రాల్లో ఫ్రాంకింగ్ మెషిన్లు పనిచేయడం లేదు. ఈ కారణాలతో చాలా మంది పాత స్టాంపు పేపర్ల కొనుగోలుకే ఆసక్తి చూపుతున్నారు.

తక్కువ ఖరీదు అందుబాటులో ఉన్నాయి

వంద రూపాయల స్టాంపు పేపర్లు తప్పితే మిగిలిన పది, ఇరవై, యాభై రూపాయల స్టాంపు (పాతవి) పేపర్లు అందుబాటులో ఉన్నాయని నగరంలోని ఓ సబ్ రిజిస్ట్రార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ-స్టాంపింగ్ వల్ల ఇబ్బంది ఏమీ లేదని, పాడైన ఫ్రాంకింగ్ మెషిన్లపై ఉన్నతాధికారులు ఏజెన్సీతో మాట్లాడి బాగు చేయిస్తున్నారని, రెండు రోజుల్లో అన్నీ అందుబాటులో ఉన్నాయన్నారు

గంజాయిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

లభ్యమవుతోందనే వివరాలను సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటారు. అలాగే నగరంలో గంజాయి వినియోగం జరుగుతున్న ప్రాంతాలు, విక్రయిస్తున్న ప్రాంతాలు, దుకాణాలపై నిరంతరం నిఘా ఉండేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోనూ ప్రత్యేకంగా యాక్షన్ టీమ్‌లను ఏర్పాటుచేయాలని డీసీపీలను ఆదేశించారు. యాక్షన్ టీమ్‌లు నిరంతరం తమ పరిధిలోని ప్రాంతాల్లో తిరుగుతూ గంజాయి వినియోగిస్తున్న యువతపై నిఘా పెడతాయి. అలాగే గంజాయి, మత్తుమందుల వినియోగం వల్ల తలెత్తే సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వీలుగా కళాశాలల్లో సదస్సులు నిర్వహించాలని సీపీ నిర్ణయించారు. దీనిని వంద రోజులపాటు పక్కాగా అమలుచేస్తే నగరంలో గంజాయి లేకుండా చేయవచ్చునని సీపీ ఆశాభావం వ్యక్తంచేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు.

ఆరుబయట మద్యం తాగితే చర్యలు : ఎస్ఐ

కంచరపాలెం, జూన్ 18 : గంజాయి సేవనం, ఆరుబయట మద్యం తాగే వారి కట్టడికి కంచరపాలెం పోలీసులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కంచరపాలెం పరిధి రైల్వే క్వార్టర్స్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి పలువురిని అదుపులోకితీసుకున్నారు. వారి కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రైవ్‌లో పాల్గొన్న ఎస్ఐ దివ్యభారతి మాట్లాడుతూ హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు సీపీ, డీసీపీ పర్యవేక్షణలో ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించినట్టు చెప్పారు. రోజూ తనిఖీ నిర్వహించి అసాంఘికపనులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.



కంచరపాలెం రైల్వే క్వార్టర్స్ పరిసరాల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి: ఆర్‌జేడీ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

కంచరపాలెం, జూన్ 18 : బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ బి.విజయభాస్కర్ ఆదేశించారు. జిల్లా శాఖ అధికారి వారి కార్యాలయంలో ఆయన మంగళవారం డీఈవో, ఎంఈవోలు, సోషల్ వెల్ఫేర్, ఐసీడీఎస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నేను బడికి పోతా..' కార్యక్రమంలో భాగంగా బడి బయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించడానికి జూన్ 13 నుంచి జులై 12 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండలస్థాయిలో ఎంఈవోలు సీఆర్పీలుతో కమిటీలుగా బడిబయట పిల్లలను శతశాతం గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నా రు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లల వివరాలను సమీప పాఠశాల్లో నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బడికి పోతా..ప్రత్యేక డ్రైవ్‌కు సంబంధించి షెడ్యూల్, రోజూ వారి కార్యాచరణ తదితర అంశాలను ఎంఈవోలకు వివరించారు. డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతు జిల్లాలో ప్రతి పిల్లాడు బడిలో ఉండేటట్టు చర్యలు తీసు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 8మండలాల ఎంఈవోలు పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో స్వామివారు

ఘనంగా ధర్మసంవర్ధిని, నగరేశ్వరస్వామి కల్యాణం

భీమునిపట్నం, జూన్ 18: స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలోని శ్రీధర్మసంవర్ధిని, నగరేశ్వరస్వామి వారి కల్యాణం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. దేవస్థానం సంఘం అధ్యక్షులు పూసర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు వెలవలపల్లి శంకర్ శర్మ నేతృత్వంలో పండితులు కల్యాణం నిర్వహించారు. ఆర్యవైశ్యులు వేడుకను తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు ముమ్మిడిశెట్టి సునీల్, వాసవి ప్రార్థనా మందిరం అధ్యక్షులు కట్టమూరి రమణారావు, భక్తులు పాల్గొన్నారు.

గంటాను కలిసిన వైసీపీ నేతలు



గంటాకు పుష్పగుచ్ఛమిస్తున్న వైసీపీ నాయకుడు

ఆనందపురం, జూన్ 18: ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మండల వైసీపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, బోని అప్పనాయుడు, కోరాడ ఆదినారాయణ తదితరులు ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛమందించారు. ఈ నెల 27న జరిగే ఆనందపురం మండల సమావేశానికి హాజరు కావాలని ఆహ్వానించారు.

పీఎం కిసాన్ యోజన నిధులు విడుదల

ఆనందపురం, జూన్ 18: పీఎం కిసాన్ యోజన 17వ విడత నిధులు విడుదల కార్యక్రమాన్ని వేములవలస పంచాయతీలో టీవీ ద్వారా రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. ఒక్కో రైతుకు రూ. 2వేల చొప్పున బ్యాంక్ ఖాతాలోకి జమ చేశారు. బంటుపల్లి కళ్లాలు, వేములవలస పంచాయతీల్లోని 350 మంది రైతులకు అందనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలనాయుడు, కార్యదర్శి నరసింగరావు, ఉపసర్పంచ్ కె.నవీన్, వ్యవసాయాధికారులు చదువుల సుబ్రమణ్యం, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

ఎంవీపీ కాలనీ, జూన్ 18: గ్రేటర్ 18వ వార్డు వాసవానిపాలెం ప్రభుత్వ మత్స్యకార పాఠశాల విద్యార్థులకు మంగళవారం ద్వారకానగర్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పేర్ల భాస్కరరావు, కార్యదర్శి పి.జి.ఎల్.లక్ష్మీనారాయణ, కోశాధికారి పంపాన వెంకటేశ్వరరావు, రీజనల్ చైర్‌పర్సన్ కె.ఎస్.కుమార్ ఉపాధ్యాయులు సత్యవేణి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మహారాజ** : మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **మ్యూజిక్ షాపు మూర్తి**: రమాదేవి, విశేష్ (గాజువాక)
- **మనమే** : జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర** : శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **సత్యభామ** : సంగం, శ్రీకన్య (గాజువాక)
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి** : వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **గం గం గణేశా** : వెంకటేశ్వర, శ్రీకన్య (గాజువాక)
- **భజే వాయు వేగం** : శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 55, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 40, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 52, బీరకాయలు 48, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 24, క్యారెట్ 30, దొండకాయలు 34, బంగాళదుంపలు 30, అరటికాయ7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 170, బరబటి 64, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 140, పొటల్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 40, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడిఅల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	128
ఫారం ధర	--	148
విత్ స్కిన్	--	266
స్కిన్‌లెస్	--	276

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..





పైడితల్లమ్మ ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు, కనకదుర్గమ్మకు ఎమ్మెల్యే వెలగపూడి పూజలు



.మొగధారమ్మ ఆలయం వద్ద అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

అంగరంగ వైభవంగా పైడితల్లమ్మ ఉత్సవం

సింహాచలం, జూన్ 18: వరాహ లక్ష్మీ నృసింహ స్వామి సోదరిగా, అడివివరం ఆరాధ్యదేవత పైడితల్లమ్మ వార్షిక మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవంలో భాగంగా ఆలయ అనువంశిక పూజారి వంశీయులు, అడివివరం మాజీ సర్పంచ్ లండ వెంకటరమణ సారథ్యంలో ఘటాల ఊరేగింపు జరిపారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. పసుపు, కుంకుమలు, చీరలు, సారెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సింహాచలం ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు పట్టువస్త్రాలను సమర్పించి పూజలు జరిపించారు. గోపాలపట్నం పోలీసులు భద్రతను కల్పించారు. సాయంత్రం గాంధీనగర్‌లోని శతకం పట్టు గుడిలో ఘటాలకు పూజారి లండ వెంకటరమణ పూజల అనంతరం ఊరేగింపుగా అనుపుమహోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం తరపున అమ్మవారికి చీరలు, పండ్లతో నీరాజనాలిచ్చారు. భక్తులు అమ్మవారి పాదాల కింద చీరలు పరిచి స్వాగతించారు. ఘటాలను మోశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ పార్టీల నేతలు సతివాడ శంకరరావు, కొలుసు ఈశ్వరరావు, ఎర్ర వరంబాబులు, మజ్జి సూరిబాబు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



బంగారమ్మ తల్లి ఆలయం వద్ద భక్తుల పూజలు

వైభవంగా దుర్గాలమ్మ అనుపోత్సవం

పద్మనాభం: స్థానిక దుర్గాలమ్మ అమ్మవారి అనుపోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన రథంపై తాలాడ, బుగత, అవనాపు కుటుంబాలకు చెందినవారు అధిరోహించగా శతకం పట్టు నుంచి పురవీధులలో మూడుసార్లు రథాన్ని ఊరేగించారు. అనంతరం చదురుగుడి నుంచి అమ్మవారిని శతకంపట్టు వద్దకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి ఆలయానికి చేరుకున్నారు. పూజారి బుగత గురునాయుడు ఆధ్వర్యంలో అయ్యవారి గురునాయుడు దంపతులు విశేష అర్చనలు చేశారు. అనంతరం మహిళలు అమ్మవారికి జలాభిషేకం చేసి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు వి.శ్రీను, పద్దు, ఎర్నాయుడు, రమణ, పైడినాయుడు, త్రినాథరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

సందడిగా మొగధారమ్మ పండుగ

సాగర్‌నగర్: గొల్లలఎండాడ, ముసలయ్యపాలెం గ్రామాల ఆరాధ్యదైవం మొగధారమ్మ అమ్మవారి పండగ మంగళవారం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకనిర్వాహకుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌తో కలసి అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పూజల్లో పాల్గొన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్పొరేటర్ లొడగల అప్పారావు, చెట్టుపల్లి గోపి, శాఖరి శ్రీనివాసరావు, సారిపల్లి శ్రీనివాసరావు, రాంబాబు, చిన్నగోపి, బాబూరావు, బి.దొరబాబు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన కనకదుర్గమ్మ సంబరాలు

వెంకోజీపాలెం: గ్రేటర్ 16వ వార్డు ఇసుకతోట శ్రీ కృష్ణ ఉమామహేశ్వర సాయిదుర్గ యాదవ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కనకదుర్గ అమ్మవారి మహోత్సవాలు అంబరాన్నంటాయి. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, వైసీపీ నేత ఎం.అప్పారావు అమ్మవారికి పూజలు చేశారు. సాయంత్రం పుర వీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు గొలగాని రాము, ప్రసాదుల పోలారావు, అధ్యక్షుడు ఈగల శివగోవింద్, ఉపాధ్యక్షుడు పల్లా అప్పారావు, మాజీ అధ్యక్షుడు బొట్టా శివ, కమిటీ సభ్యులు బొట్టా గణేష్, పల్లా శివ, మువ్వల శ్రీను, ప్రసాదుల అప్పారావు, బొట్టా లింగేష్ తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభంలో దుర్గాలమ్మ రథం ఊరేగింపు

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా: ఎమ్మెల్యే గంటా

పద్మనాభం/రూరల్, జూన్ 18: ఎన్నికలలో ఘన విజయాన్ని అందించిన భీమిలి నియోజకవర్గ ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని కొయ్యపేట, పాండ్రంగి గ్రామాలలో మంగళవారం రాత్రి నిర్వహించిన విజయోత్సవ సభలలో ఆయన ప్రసంగించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ఐదు హామీలపై సంతకాలు చేశారన్నారు. రానున్న రోజులలో అన్ని హామీలను నెరవేర్చడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రజలు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆర్ఎస్‌డీపీ అప్పలనర్సింహరాజు, భీమిలి టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, కె.రమణ, కె.దామోదరరావు, గాడు వెంకటప్పడు, గోపీబాబు, లీలావతి, నగేష్‌కుమార్, నారాయణమ్మ, వెంకటరమణ, సూర్యనారాయణ, అప్పలరాజు, చంద్రరావు, రామరాజు, అప్పలరమణ తదితరులు పాల్గొన్నారు.



కొయ్యపేట విజయోత్సవ సభలో ఎమ్మెల్యే గంటా

ఐకమత్యానికి పండగలు దోహదం

కొమ్మాది: ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందించడంలో గ్రామ దేవతల పండగలు దోహదపడతాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన రేవళ్లపాలెం గ్రామదేవత బబ్బేలమ్మ పండగ పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి శ్రీనివాస్, గొలగానిసన్యాసిరావు, పోతినఎల్లంనాయుడు, లొడగల జానకీరామ్, పోలిశెట్టి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



రేవళ్లపాలెం అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే గంటా

అభివృద్ధి పనులను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

భీమునిపట్నం, జూన్ 18: జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ మంగళవారం జోన్-1 (భీమిలి) కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా, కార్యాలయంలో రూ.50 లక్షలతో చేపడుతున్న మరమ్మతులు, అభివృద్ధి పనులను, అలాగే, సుమారు రూ.3 కోట్లతో చేపట్టిన మెయిన్‌రోడ్ గంట స్తంభం సమీపంలోని లాల్‌బహదూర్‌శాస్త్రి మునిసిపల్ ఫిష్, వెజిటబుల్ మార్కెట్, షాపింగ్ సముదాయ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్ కార్యాలయం ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలని ఆయన జడ్సీ కనకమహాలక్ష్మిని ఆదేశించారు. మార్కెట్‌కు ప్రహరీగోడ నిర్మించాలన్నారు. ఆయనతోపాటు జీవీఎంసీ కార్యనిర్వాహక కార్యదర్శి శాంతిరాజు, వెంకటేశ్వరరావు, జోన్-1 ఏసీపీ డి.శ్రీనివాసరావు, ఏఈ సుమన్ తదితరులు పాల్గొన్నారు.



జోన్-2 కార్యాలయం పనులు పరిశీలిస్తున్న దృశ్యం

జోన్-2 కార్యాలయం పరిశీలన

కొమ్మాది: జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో జరుగుతున్న ఆధునికీకరణ పనులను కమిషనర్ సాయికాంత్‌వర్మ మంగళవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ పనులు త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎస్ఈ శ్యాంసన్‌రాజును ఆదేశించారు. కార్యాలయంలోని అన్ని విభాగాల్లో ఏర్పాటు చేసిన నూతన సామగ్రి, మీటింగ్ హాల్, కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించారు. కార్యాలయ మెట్లమార్గాన్ని పునరుద్ధరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ శైలజావల్లి, డీఈ శాంతిరాజు, ఎ.ఎం.హెచ్.ఓ. కిషోర్, ఆర్వో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ సముదాయం ప్లాన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

రోడ్డు పనులు పూర్తి చేయరూ..

ఆనందపురం, జూన్ 18: మండలంలోని లొడగలవానిపాలెం పంచాయతీ శ్రమజీవుల కాలనీ రహదారిని పూర్తిచేయాలని కోరుతున్నారు. శ్రమజీవుల కాలనీ, బాలికల వసతి గృహానికి వెళ్లే రహదారికి ఇటీవల మరమ్మతులు ప్రారంభించి రోడ్డు మధ్యలో పైపులైను ఏర్పాటు చేసి వదిలేశారు. నెల రోజులైనా తిరిగి ప్రారంభించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలలు తెరచుకోవడంతో విద్యార్థులు రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. బాలికల వసతి గృహానికి సరకులను తరలించడానికి సమస్య ఎదురవుతోంది. దీనికితోడు రోడ్డు మధ్యలో రాళ్లు కుప్పలుగా ఉండిపోవడంతో నడవటానికి కూడా అవకాశం లేకుండా పోయింది. అధికారులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.



అసంపూర్తిగా వదిలేసిన రహదారి

అప్పన్న సన్నిధిలో స్వాతి నక్షత్ర హవనం



స్వాతి నక్షత్ర హవనం చేస్తున్న రుత్వికులు

సింహాచలం, జూన్ 18: వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవళంలో మంగళవారం స్వాతి నక్షత్ర హవనం నిర్వహించారు. నృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రం సందర్భంగా ప్రతినెలా ఆర్జిత సేవగా జరుప%తారు. సుదర్శన పెరుమాళ్‌ను యాగమూర్తిగా వేదికపై అధిష్ఠింపజేశారు. స్థానాచార్యులు,ప్రధానార్చకులు మండపారాధన, బింబారాధన, కలశారాధనలు చేపట్టారు. 50 జంటల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. రాగిమాడకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమకుండంలో వృద్ధాగ్నితో అగ్ని ప్రతిష్ఠ కావించారు. విశేష హవనాన్ని, మహాపూర్ణాహుతి చేశారు. ప్రధాన కలశాన్ని అర్చకస్వామి శిరస్సున దాల్చి భక్తులు, మంగళ వాయిద్యాలు వెంటరాగా బేడామండప ప్రదక్షిణ చేసి అంతరాలయంలో స్వామివారి సన్నిధిలో ఉంచి పూజలు జరిపారు. అందులోని పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ చేసి వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

వైభవంగా ఆర్జిత నిత్యకల్యాణం

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్యకల్యాణం మంగళవారం జరిగింది. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. శాస్త్రోక్తంగా కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేశారు. వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణలు చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

లక్ష్మీనారాయణుల తిరుకల్యాణోత్సవం

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవళంలో కొలువుదీరిన లక్ష్మీనారాయణుల వార్షిక తిరు కల్యాణమహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు అప్పన్నస్వామి దర్శనాలు నిలిపివేసిన తరువాత లక్ష్మీనారాయణుల ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ధ్వజారోహణం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. కంకణధారణలు కావించి యజ్ఞోపవీతాన్ని స్వామివారికి వేశారు. కన్యావరుణలు పండితులకిచ్చి వధూవరుల గోత్రప్రవరలను తెలిపి కల్యాణ ప్రక్రియను పారంభించారు. మాంగళ్య సమర్పణ జరిపి అక్షితారోపణ(తలంబ్రాలు)ను వేడుకగా నిర్వహించారు. లక్ష్మీనారాయణులకు ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు నూతన వస్త్రాలు సమర్పించగా, స్థానాచార్యులు డా.టిపి రాజగోపాల్ పర్యవేక్షించారు.



లక్ష్మీ నారాయణుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పల్లాకు నేతల అభినందనలు



పల్లాను సత్కరిస్తున్న వంశీకృష్ణ, అభినందిస్తున్న గోవింద్, ఒమ్మి

మద్దిలపాలెం, జూన్ 18: గత వైసీపీ ప్రభుత్వంపై అవిశ్రాంత పోరాటం చేసిన పల్లా శ్రీనివాసరావుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కడం తగిన గుర్తింపు లభించడమేనని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైనా సందర్భంగా పల్లా శ్రీనివాసరావును మంగళవారం వంశీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ దుర్మార్గాల నుంచి టీడీపీని రక్షించడానికి పల్లా చేసిన పోరాటాల్లో కష్టనష్టాలు చవిచూశారన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సౌమ్యుడుగా పేరుతెచ్చుకున్నారన్నారు. రానున్న రోజుల్లో తన పనితీరుతో చంద్రబాబు మెప్పు పొంది మరిన్ని పదవులు సాధించాలన్నారు. జనసేన నుంచి పల్లాకు మద్దతు ఉంటుందన్నారు.

అభినందించిన గోవింద్, ఒమ్మి శ్రీనివాసరావు

రామ్‌నగర్: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావును పార్టీ కార్యాలయంలో మంగళవారం పలువురు అభినందించారు. విశాఖ పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడమూరు గోవింద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి శ్రీనివాసరావు పల్లాకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం పరిశీలన



వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు

ఆనందపురం, జూన్ 18: మండలంలోని తర్లువాడ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం ఆస్ట్రేలియాకు చెందిన శాస్త్రవేత్తలు సందర్శించారు. గ్రామంలో ఆవుపేడ, ఆవు మూత్రం, వేపాకు, బెల్లం, పుట్టమట్టి, నిమ్మకాయలు నీళ్లతో కలిపి జీవామృతం, బీజామృతంను తయారు చేసి ఆకుకూరలు, బెండ, వంకాయ, బొప్పాయి, మిరప, చిరుధాన్యాలు, రాగులు, సామలు, అరికెలు, కొర్రలు, గంటెలు తదితర పంటలను పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా శాస్త్రవేత్త రెబెకా సందర్శించి సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు కృష్ణారావు, మోహనరావు, ప్రకాశ్, స్థానిక సర్పంచ్ బి.ఆర్.బి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి



అంధ బాలికల పాఠశాలకు సామగ్రిని అందిస్తున్న యూబీఐ సీఈవో

సాగర్‌నగర్, జూన్ 18: అంధత్వాన్ని అధిగమించి బాలికలు ప్రతి బాటవాలను చూ పడం గొప్పవిషయమని యూనియన్‌బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో మణిమేకలై అన్నారు. మంగళవారం సాగర్‌నగర్ బీచ్‌రోడ్డులో ఉన్న ప్రభుత్వ అంధబాలికల ఆశ్రమపాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌కు రెండు ఏసీలు, బీరువా, రూ. 47వేలు విలువచేసే బ్రెయిలీ రీడర్స్, స్పోర్ట్స్ దుస్తులు, స్నాక్స్ తదితరాలను ఆమె అందజేశారు. విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో విద్యనభ్యసించి భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి.తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు ఏటా పదోతరగతి పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారన్నారు. ఆట, పాటల్లో పేరుతెస్తున్నారన్నారు. పాఠశాలకు దాతలు మరింత సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూన్‌యన్ బ్యాంక్ జోనల్ హెడ్ షాలిని మీనన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మజ్జివలస కూడలిలో యువకుల రక్తదానం

భీమునిపట్నం (రూరల్), జూన్ 18: మజ్జివలస సమీపంలో మంగళవారం రక్తదానం శిబిరం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. సర్పంచ్ గాడు నారాయణ ప్రారంభించారు. పలువురు యువకులు 20 యూనిట్ల రక్తాన్ని రోటరీ రక్తనిధి కేంద్రానికి అందించారు. అనంతరం పరిసర గ్రామాలకు చెందిన రెండువేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గాడు అప్పలనాయుడు, తాతినాయుడు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

ఆరిలోవ, జూన్ 18: వార్డు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని జీవీఎంసీ పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి తెలిపారు. బీఎస్ఆర్‌నగర్, తోటగరువు తదితర ప్రాంతాలలో జీవీఎంసీ అధికారులతో కలిసి మంగళవారం ఆమె పర్యటించారు. రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, విద్యుత్‌స్తంభాలు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నేతలు మద్దిల రాజశేఖర్, ఒమ్మి అప్పలరాజు, గాడు అప్పలనాయుడు, కేతా సత్యనారాయణ, మాణిక్యాలరావు, కొండమ్మ, బుజ్జిమ్మ, ప్రభ, రమా, రామచంద్రరావు, రమణ, త్రినాథ్, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.